# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
1-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:15
సంచిక: 349

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# వేట్లపాలెం ఘటనలో 23 మంది సజీవ దహనం..



## 9 మందికి తీవ్ర గాయాలు

- ఆ సమయంలో మందు గుండు తయారీలో 30--40 మంది వరకు కూలీల నిమగ్నం
- చెవులు చిల్లులు పడేలా ఏకధాటిగా రెండు గంటలపాటు పేలుళ్లు
- 20--30 అడుగుల ఎత్తున ఎగిరిపడ్డ తలలు.. కాళ్లు.. చేతులు.. మొండేలు
- ఘటనా స్థలిని పరిశీలించిన సిఎం చంద్రబాబు.. మృతుల కుటుంబాలకు 20లక్షల చొప్పున సాయం
- క్షతగాత్రులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పూర్తి చికిత్స.. బాణాసంచా తయారీ కేంద్రాల్లో పక్కాగా నిబంధనలు
- పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం



**కాకినాడ,(క్రైమ్ మిర్రర్):** కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 21కు చేరింది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మరో 9మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.అయితే, వేట్లపాలెంలో బాణసంచా ప్రమాద స్థలిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వాహనంలో వేట్లపాలెం చేరుకున్నారు. బాణసంచా పేలుడు బాధిత కుటుంబాలను పరామర్శించారు.




మిగతా 2లో

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి?

### ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు

### దద్దరిల్లుతున్న టెహ్రాన్, ఇతర నగరాలు



- భారీగా క్షిపణులు, బాంబు దాడులు
- ఖమేనీ తదితరులే లక్ష్యంగా వేట
- పలువురు కీలక కమాండర్ల మృతి!
- స్కూలుపై దాడి, 85 మంది బలి
- మృతులు 200, క్షతగాత్రులు 700
- భారీగా ప్రతిదాడులకు దిగిన ఇరాన్
- ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్ల వర్షం
- అమెరికా గల్ఫ్ స్థావరాలపై దాడులు
- బహ్రెయిన్, యూఏఈ, ఖతర్, సౌదీ సహా ఆరేడు దేశాల్లో పేలుళ్లు

దుబాయ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించారని ప్రకటించారు. ఆయన ఖమేనీను "చరిత్రలో అత్యంత దుష్టులలో ఒకరు" అని పేర్కొన్నారు. ఇది "ఇరాన్ ప్రజలకు మాత్రమే కాదు అమెరికన్లకు, ప్రపంచంలోని అనేక దేశాల ప్రజలకు న్యాయం" జరిగిందని అన్నారు.

## ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ రక్షణమంత్రి హతం

### ప్రకటించిన ఇజ్రాయిల్

**టెహ్రాన్, (క్రైమ్ మిర్రర్):** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా శనివారంనాడు చేపట్టిన దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నాసిర్జాదే మృతి చెందినట్టు తెలుస్తోంది.

మిగతా 2లో



# ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు అండగా ...


- ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- పారిశ్రామికీకరణలో తెలంగాణ ఆదర్శం కావాలి
- ప్రతి ప్రభుత్వ ఆఫీస్‌కు సొంత భవనం ఉండాల్సిందే
- పాత పద్ధతి నుంచి..సాంకేతికంగా అప్‌డేట్ కావాల్సిందే
- ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలి
- నిర్ణీత సమయంలో ఫైళ్లు క్లియర్ చేయాల్సిందే
- 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో చర్చ
- అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్

మిగతా 2లో

# టెన్త్ పరీక్షలు రద్దు?

### ఎస్సెస్సీ బోర్డును ఎత్తేయాలన్న విద్యా కమిషన్

### ఇంటర్ బోర్డుతో విలీనం చేయాలి



(క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో )

తెలంగాణలో ఇకపై పదో తరగతికి బోర్డు పరీక్షలు ఉండవా? మొత్తంగా ఎస్సెస్సీ బోర్డే రద్దు కానుందా? ఇంటర్ బోర్డుతో ఎస్సెస్సీ బోర్డును విలీనం చేసి ఒకేసారి 12వ తరగతి పరీక్షలు నిర్వహిస్తారా? ఎప్ సెట్ ను కూడా రద్దు చేసి.. ఇంటర్లో వచ్చిన మార్కుల ఆధారంగానే ఇంజనీరింగ్ సీట్లు ఇస్తారా? అంటే.. ఈ విషయాల్లో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదుగానీ.. సర్కారుకు తెలంగాణ విద్యా కమిషన్ చేసిన సిఫారసులు మాత్రం సంచలనం సృష్టిస్తున్నాయి.

- 12వ తరగతిలోనే పరీక్షలు నిర్వహించాలి
- ఎప్ సెట్ నూ రద్దు చేయాలి.. ఇంటర్
- మార్కుల ఆధారంగానే ఇంజనీరింగ్ సీట్లు ఇవ్వాలి
- టీచర్లకు ఆటోమేటిక్ పదోన్నతుల విధానం వద్దు
- ఉపాధ్యాయుల పనితీరుపై ఐదేళ్లకోసారి సమీక్ష..
- ఫెయిలైతే సర్వీసు నుంచి డిస్మిస్
- ప్రభుత్వానికి తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులు

తెలంగాణలో విద్యా శాఖలో సంస్కరణలు తీసుకు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆకునూరి మురళి చైర్మన్ గా ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ అనేక సిఫారసులు చేసింది. ప్రధానంగా.. 10, 11, 12వ తరగతుల్లో వరుసగా మూడేళ్లు బోర్డు పరీక్షలతో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉందని పేర్కొంది.ఎస్సెస్సీ బోర్డును రద్దు చేసి.. ఇంటర్ బోర్డుతో విలీనం చేయాలని కమిషన్ సూచించింది.

మిగతా 2లో

# దుబాయ్‌పై క్షిపణి దాడులు...

### వీడియో పంచుకున్న మంచు విష్ణు

- కుటుంబాన్ని కలిసేందుకు దుబాయ్ వెళ్లిన మంచు విష్ణు
- ఆకాశంలో క్షిపణులు చూసి భయాందోళన
- భారీ శబ్దాలకు ఇల్లు దద్దరిల్లిందన్న నటుడు
- చిన్నారి ఐరా భయపడిందంటూ ఆవేదన
- యూఏఈ రక్షణ దళాలకు ప్రత్యేక కృతజ్ఞతలు

టాలీవుడ్ ప్రముఖ నటుడు, మా అధ్యక్షుడు మంచు విష్ణుకు దుబాయ్‌లో భయానక అనుభవం ఎదురైంది.

# భూదాన్ భూములు వ్యవహారంలో సంయమనం పాటించండి

- అర్హులైన పేదలను గుర్తించాల్సిందిగా కలెక్టర్‌కు ఆదేశం
- పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చి ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

హైదరాబాద్,ఫిబ్రవరి28(ఆర్ఎన్ఎ): ఖమ్మం జిల్లాలో భూదాన్ భూముల వ్యవహారంలో

# రేవంత్ రెడ్డి నిర్ణయంపై హరీశ్ రావు ప్రశంసలు

- శారదాపీఠంకు కేటాయించిన భూములు పీఠానికే చెందేలా సీఎం ఆదేశాలు
- ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమన్న ముఖ్యమంత్రి
- రేవంత్ రెడ్డికి అమ్మారు ఇప్పటికైనా సరైన బుద్ధి ప్రసాదించారన్న హరీశ్ రావు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఒక నిర్ణయంపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం



# భగభగలు.. వడగాలులు

- ఈ వేసవిలో అత్యధిక వేడిమి రోజులే ఉండే చాన్స్
- ఏప్రిల్ మొదటి వారం నుంచే 40 డిగ్రీలు
- దాటనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు... మే నెలలో గరిష్టంగా
- 44 నుంచి 46 డిగ్రీ సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు

హైదరాబాద్: వేసవి భగభగలు తీవ్రమవుతున్నాయి. ప్రస్తుతం సాధారణ స్థితిలో నమోదు కావాల్సిన

# ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు అండగా ...

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. మార్చి 4 న జరిగే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపైన మాట్లాడుతానని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరు తో 99 రోజుల కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక లోగో తయారు చేస్తున్నాం..కేంద్రం ఏర్పాటు చేసిన ఏ ఐ సమావేశం నిర్వహణ పైన కొన్ని విమర్శలు వచ్చాయి..కానీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రణాళికా బద్ధంగా జీహెచ్ ఎం సీ ని మూడు కార్పొరేషన్ లు గా విభజించాం..కోర్ అర్బన్ రీజియన్ లో చేపట్టాల్సిన కార్యాచరణ పైన అధికారులు దృష్టి పెట్టాలి..ఫ్యూర్ అర్బన్ రీజియన్ 10 వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించి ఉంది..ఇక్కడ



మాన్యుఫాక్చరింగ్ రంగం విస్తరించాలి. పారిశ్రామికీకరణ లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా ఉండాలని అంటూ.. దీనిపైన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సేవా రంగంలో వస్తున్న పెను మార్పులు గమనంలోకి తీసుకోవాలి..శాఖలపైన ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలి.. శాఖలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా సిద్ధం చేయాలి..ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు.. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి..బడ్జెట్ ప్రతిపాదన లో వీటిని చేర్చాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల పైన ప్రతి శాఖ దృష్టి పెట్టాలి..అధికారులు అప్రమత్తం గా ఉండాలి సర్వీస్ సెక్టార్ ను పూర్తి గా ప్రక్షాళన చేయాలి..ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలని సూచించారు. ఫైల్ విధానం ఉండాలి..నిర్ణీత సమయంలో ఫైల్ క్లియర్ కావాల్సిందే. వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు ,పెట్టుబడులు గ్రౌండ్ కావాలి.. పాత కాలం సర్వర్ లను అప్డేట్ చేసుకోవాలి..సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి..ఇందులో సాంకేతికత ను వినియోగించుకోవాలి

నిజమైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందాలి. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ పైన దృష్టి పెట్టాలి..ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక స్థితిని ని మార్చబోతోంది..మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం ..ఇక్కడ వచ్చే మార్పులను ప్రజలకు వివరించాలి.డిజిటల్ గవర్నెన్స్ పైన దృష్టి పెట్టాలి..నాణ్యమైన విద్య ను అందించడం పైన దృష్టి సారించాలి..వంద నియోజకవర్గాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించుకోబోతున్నాం .. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తాం..ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలు మెరుగుపడాలి..ప్రాంతాల వారీగా మెడికల్ డేటా తయారు చేయాలి.ప్రతి సెక్రటరీ తమ శాఖ లల్లో బెస్ట్ ప్రోగ్రామ్ ను డిజైన్ చేసుకోవాలి.. మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక జూన్ 12 వరకు జరగబోతుంది.. జూన్ 2 వరకు ప్రతి ఆఫీస్ పరిశుభ్రంగా కావాల్సిందే.. జూన్ 2 తెలంగాణ కు పండుగ..పండుగ ను అంతా ఘనంగా జరుపుకోవాలి. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రతి అధికారి ఈ కార్యక్రమం లో పాల్గొనాలి..మినహాయింపు లు ఉండవు శాఖ ల మధ్య సమన్వయం ఉండాలి.

# టెన్త్ పరీక్షలు రద్దు?

అంతేకాకుండా.. కనీస ఉత్తీర్ణత మార్కులను పాఠశాల స్థాయిలో 35 నుంచి 45 శాతానికి, ఉన్నత విద్యా సంస్థల్లో 35 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని పేర్కొంది. విశ్వవిద్యాలయాల కార్యనిర్వాహక మండలిని పునర్నిర్మించాలని, చైర్మన్‌గా వీసీ, వైస్ చాన్సలర్ నియామకానికి మాజీ సీఎస్, ముగ్గురు రిటైర్డ్ వీసీలతో సెర్చ్ కమిటీ నియమించి ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని సూచించింది.

**టీచర్ల ఆటోమేటిక్ ప్రమోషన్లు రద్దు?**

ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రస్తుతం ఉన్న ఆటోమేటిక్ ప్రమోషన్ల విధానాన్ని రద్దు చేయాలని, పనితీరు ఆధారంగానే పదోన్నతులు కల్పించాలని విద్యా కమిషన్ ప్రతిపాదించింది. కొత్తగా నియమితులయ్యే ఉపాధ్యాయుల పనితీరును ప్రతి ఐదేళ్లకోసారి సమీక్షించాలని, మెరుగుపడని పక్షంలో వారిని సర్వీసు నుండి తొలగించాలని పేర్కొంది. విద్యా విధానం పూర్తిగా విద్యార్థి కేంద్రంగా ఉండాలని, నర్సరీ నుంచే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని సూచించింది. ఒకటో తరగతి నుండి తెలుగు/ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ భాషలతో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలని పేర్కొంది.

**నివేదికలోని మరిన్ని కీలక అంశాలివే..!**

- నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు ప్రైమరీ బీఎడ్, 6-12వ తరగతి వరకు సెకండరీ బీఎడ్ ప్రవేశపెట్టాలి. డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రద్దు చేయాలి.
- అన్ని పాఠశాలల్లో త్రిభాషా సూత్రం అమలు చేయాలి. తెలుగు/ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ బోధించాలి. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు బోధనా మాధ్యమం ఇంగ్లీష్ ఉండాలి. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీ ప్రవేశపెట్టాలి. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, సిబ్బంది నియామకం, వసతుల కల్పన, పర్యవేక్షణకు పాఠశాల జిల్లాలను ఏర్పాటు చేయాలి. మధ్యాహ్న భోజనానికి ప్రతి వారం చెల్లింపులు చేయాలి. అంచనాలు, చెల్లింపులకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలి. ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లు, హాస్టళ్ల నియంత్రణకు ప్రత్యేక చట్టం చేయాలి. వాటికి ప్రత్యేక అనుమతులు తప్పనిసరి చేయాలి.
- విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎయిడెడ్ పాఠశాలలు, కాలేజీలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. వాటిని రద్దు చేసి ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలి. పాలిటెక్నిక్, ఐటీఐలతో ఉద్యోగాలు పొందే వారి సంఖ్య తక్కువగా ఉంది. ఆ కోర్సులు పూర్తవగానే ఉద్యోగం లభించేలా వీటిని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుబంధంగా మార్చాలి. జాతీయ విద్యా విధానంలో కొన్ని మంచి నిర్ణయాలు కూడా ఉన్నాయి. వాటిని అమలు చేయాలి. విద్యా హక్కు చట్టం ప్రస్తుతం 6-14 చిన్నారులకు అమల్లో ఉంది. దీనిని 3-18 ఏళ్ల వయస్కులకు అమలు చేయాలి. అన్ని రెసిడెన్షియల్ కాలేజీల విద్యా సంస్థలను ఒకే సంస్థగా చేయాలి. ఇందుకు తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీగా ఏకీకరించాలి. గిరిజన సంక్షేమ శాఖ కింద 1-5 తరగతులు నడుపుతున్న మినీ గురుకులాలను రద్దు చేయాలి.

# వేట్లపాలెం ఘటనలో 23 మంది సజీవ దహనం..

(మొదటి పేజీ తరువాయి)

పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. పేలుడు ఘటన తీరును అధికారులు సీఎంకి వివరించారు. ఈ ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం చంద్రబాబు, బాధితులకు అవసరమైన అన్ని సహాయాలు అందిస్తామని మాటిచ్చారు. అలాగే మృతుల కుటుంబాల పిల్లల విద్య బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారి చదువు పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని ఖర్చులనూ భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఎంత ఖర్చయినా మెరుగైన వైద్యం అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఆర్డీవో, డీఎస్పీ, అగ్నిమాపక శాఖాధికారి, కార్మిక శాఖ అధికారులను సస్పెండ్ చేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. బాధ్యతల నిర్వహణలో విఫలమైన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన బాణసంచా వ్యాపారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు అందజేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. గత ఏడాది కొమరపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటన తర్వాత ప్రభుత్వం ఒక ప్రత్యేక పాలసీ రూపొందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఆ పాలసీని పూర్తిగా అమలు చేసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. బాధితుల పట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.సిఎం వెంట హోంమంత్రి అనిత, బిజెపి అధ్యక్షుడు పిఎన్‌వి మాధవ్ ఉన్నారు.

# ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ రక్షణమంత్రి హతం

ఇజ్రాయెల్ మిటలరీ ఆపరేషన్స్ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. అయితే దీనిపై ఇరాన్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అమీర్ నాసిర్జాదే 2024 ఆగస్టు నుంచి ఇరాన్ రక్షణ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇరానియన్ సాయుధ దళాల డిప్యూటీ ఆఫ్ స్టాఫ్‌గా, ఇరాన్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్‌గా సేవలందించారు. ఇదే దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమామండర్ మహమ్మద్ పాక్పౌర్ కూడా మరణించినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ వర్గాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. ఇరాన్ మాత్రం ఇంకా స్పందించాల్సి ఉంది. ఇరాన్ నాయకులే లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా టెహ్రాన్‌పై దాడులకు దిగాయి. టెహ్రాన్‌లోని మొత్తం 30 ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ నివాసాన్ని టార్గెట్ చేసుకుని ఇజ్రాయెల్ దళాలు దాడులకు దిగాయి. అయితే ఖమేనీ అంతకు ముందే సురక్షితంగా తప్పించుకున్నట్టు సమాచారం. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ లక్ష్యంగానే ఈ దాడులు జరిగినట్టు కథనాలు వెలువడుతున్నాయి.

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి?

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్త ఆపరేషన్‌లో ఖమేనీ నివాస సముదాయంపై 30 బాంబులు వేశారని ఇజ్రాయెల్ ఛానల్ 12 నివేదిక తెలిపింది. ఇజ్రాయెల్ ప్రధాని నెటాన్యాహు కూడా ఖమేనీ మరణించి ఉండవచ్చన్న సంకేతాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అయితే, ఇరాన్ విదేశాంగ మంత్రి చీదీజ చీవషంతో మాట్లాడుతూ, "ఖమేనీ బతికే ఉన్నారు, నాకు తెలిసినంతవరకు అందరు ఉన్నతాధికారులు సురక్షితంగానే ఉన్నారు" అని తెలిపారు. దీదీజకి ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బకాయీ మాట్లాడుతూ, "ఏదైనా ధృవీకరించే స్థితిలో లేను, కానీ దేశం మొత్తం జాతీయ సమగ్రతను కాపాడడంపై దృష్టి పెట్టింది" అని అన్నారు. అమెరికా అన్నంత పనీ చేసింది. పశ్చిమాసియాను మరోసారి రణరంగంగా మార్చింది. మిత్ర దేశం ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై శనివారం భారీ స్థాయిలో దాడులకు దిగింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'పేరిట అమెరికా, 'ఆపరేషన్ రోరింగ్ లయన్'పేరుతో ఇజ్రాయెల్ రణన్నినాదం చేశాయి. శనివారం ఉదయం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు ప్రాంతాలపై క్షిపణులు, బాంబు దాడులతో విరుచుకుపడ్డాయి. ముఖ్యంగా ఉత్తర టెహ్రాన్‌లో 30కి పైగా ప్రంతాలపై ఒకేసారి దాడులకు దిగాయి. ఇరాన్ నాయకత్వాన్నే లక్ష్యం చేసుకున్నట్టు ఇరు దేశాలూ ప్రకటించాయి. సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (86), అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పాటు ఇతర అగ్ర నేతలే లక్ష్యంగా దాడులు కొనసాగాయి. తొలి పేలుళ్లు ఖమేనీ, పెజెష్కియాన్ నివాసాలు, కార్యాలయాల సమీపంలోనే చోటుచేసుకున్నాయి. అప్పటికే ఖమేనీ, పెజెష్కియాన్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు ఇరాన్ వర్గాలు పేర్కొన్నా, పలువురు ఇరాన్ కీలక సైనిక కమాండర్లు, నేతలు దాడుల్లో మరణించినట్టు చెబుతున్నారు. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రధాన కార్యాలయ భవనంపై జరిగిన భారీ క్షిపణి దాడులు ఈ వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. టెహ్రాన్‌తో పాటు ఇరాన్‌వ్యాప్తంగా పలు నగరాలు పేలుళ్లతో దద్దరిల్లిపోతున్నాయి. టెహ్రాన్‌లో ఎక్కడ చూసినా దట్టమైన పొగ వెలువడుతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడికి దిగడం 8 నెలల్లో ఇది రెండోసారి.

# భూదాన్ భూములు వ్యవహారంలో సంయమనం పాటించండి

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న ప్రచారం పట్ల ఆవేశానికి లోనుకాకుండా కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని కోరుతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఈ విషయంలో దుష్ప్రచారం చేస్తున్న కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు, సోషల్ మీడియా వ్యక్తుల పై కేసులు పెట్టాల్సిన అవసరం లేదు. పేదల పట్ల మన నిబద్ధత, మానవీయ కోణం రేపటి నాడు స్పష్టమయ్యాక వాళ్లు కూడా ప్రభుత్వ చర్యను సమర్థించాల్సిన పరిస్థితి వస్తుంది. భూదాన్ భూముల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో గూడు ఇచ్చే బాధ్యత నాది. పేదల సంఘం ముసుగులో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేసి, పేదలను అడ్డు పెట్టుకుని సొమ్ము చేసుకుంటుంటే బాధ్యత గల ప్రభుత్వంగా చూస్తూ ఊరుకోదు. అక్రమార్కుల పై చర్యల విషయంలో ఎంత కఠినంగా ఉంటామో, పేదల విషయంలో అంతే మానవీయంగా ఉంటాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా ప్రభుత్వంలో ఏ పేదవాడికి అన్యాయం జరగదు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టించి, గృహ ప్రవేశాలు చేయించే బాధ్యత నేను తీసుకుంటాను. అక్రమార్కుల చేతిలో మోసపోయి, హక్కు లేని భూమిలో, కబ్జాదారుల్లాగా బతకాల్సిన ఖర్మ పేదలకు లేదు. గత ఆరేడేళ్లుగా భూదాన్ భూముల్లో కనీస సదుపాయాలు లేని దుర్భర పరిస్థితుల్లో పేదలు బతుకుతున్నారు. కరెంట్, డ్రైనేజీ, తాగేందుకు కనీసం మంచినీటి వసతి, సరైన రోడ్లు కూడా లేని దుస్థితి అక్కడ ఉంది. కొందరు కబ్జాదారుల చర్యలతో అన్యాక్రాంతమైనందువల్ల అక్కడ కనీస సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితి ప్రభుత్వానికి ఉంది. ఈ ప్రభుత్వంలో పేదలు ఇంత దుర్భర బతుకులు బతకాల్సిన అవసరం లేదు.

# దుబాయ్‌పై క్షిపణి దాడులు...

ప్రస్తుతం తన కుటుంబాన్ని కలిసేందుకు దుబాయ్ వెళ్లిన ఆయన, అక్కడ నెలకొన్న యుద్ధ వాతావరణం చూసి ఆందోళనకు గురయ్యారు. ఆకాశంలో క్షిపణులు వెళుతుండటం, వాటిని అడ్డుకుంటున్న దృశ్యాలు తన కంటపడ్డాయని విష్ణు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.ముఖ్యంగా క్షిపణులను అడ్డుకుంటున్న సమయంలో వచ్చిన భారీ శబ్దాలకు తాము బస చేసిన ఇల్లు దద్దరిల్లిపోయిందని విష్ణు పేర్కొన్నారు. ఈ శబ్దాలకు తన చిన్న కూతురు ఐరా తీవ్రంగా భయపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏ చిన్నారి కూడా ఇలాంటి యుద్ధ వాతావరణంలో, బాంబుల శబ్దాల మధ్య పెరగకూడదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా పిల్లలకు ప్రశాంతమైన వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు.అయితే, పౌరుల రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న యూఏఈ రక్షణ దళాలకు మంచు విష్ణు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి వల్లే తాము క్షేమంగా ఉన్నామని చెప్పారు. జీవితం ఎంత చిన్నదో, ఎంత సున్నితమైనదో ఇలాంటి ఘటనలు గుర్తుచేస్తాయని ఎమోషనల్ అయ్యారు.

# భగభగలు.. వడగాలులు

హైదరాబాద్: వేసవి భగభగలు తీవ్రమవుతున్నాయి. ప్రస్తుతం సాధారణ స్థితిలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఒకట్రెండు డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదవుతుండగా రానురాను తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా మార్చి నుంచి మే మధ్య కాలాన్ని వేసవి సీజన్‌గా పరిగణిస్తాం. ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి రెండో వారం నుంచే ప్రారంభమయ్యాయి. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సాధారణం, అంతకంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో మాత్రం సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది వేసవి సీజన్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. గతేడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యనున్న చలికాలంలో ఉష్ణోగ్రతలు భారీగా పతనం కావడం, ఎక్కువ రోజులు అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, దీనికితోడు చలి తీవ్రత కూడా అధికంగా ఉండగా ఈ ఏడాది వేసవిలో ఇదే తరహాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వేడితో కూడుకున్న రోజులు ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్లు నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం సాధారణ స్థితిలోనే ఉన్నాయి. రానున్న మూడు రోజులు సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని, ఈనెల రెండు, మూడో వారంలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు నమోదు కానున్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈనెలాఖరు నుంచి ఉష్ణోగ్రతల పెరుగుదల వేగంగా ఉంటుందని ఏప్రిల్ మొదటి వారంలో ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటే అవకాశం ఉందని, ఈ సీజన్‌లో గరిష్టంగా 44 నుంచి 46డిగ్రీ సెల్సియస్ మధ్యలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. అదేవిధంగా భూపాలపల్లి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వడగాలుల ప్రభావం అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో వడగాలులు కూడా ఎక్కువ రోజులు వీస్తాయని, వాతావరణంలో నెలకొన్న మార్పులుతో అత్యంత చలి, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు ఐఎండీ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి నిర్ణయంపై హరీశ్ రావు ప్రశంసలు

చేశారు. కోకాపేటలోని శారదాపీఠంకు కేటాయించిన భూములను తిరిగి పీఠానికే కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడంపై హరీశ్ రావు స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.కోకాపేటలో శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేయడం రాజ శ్యామలాదేవి అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయమని, ఇది భక్తుల విజయమని పేర్కొన్నారు. ఆ అమ్మవారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరైన బుద్ధి ప్రసాదించారని అన్నారు.అదే సమయంలో, ఎలాంటి స్పష్టమైన ప్రజాప్రయోజన ప్రతిపాదిక లేకుండా పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తూ నామినేషన్ పద్ధతిలో మీ అల్లుడి అనుయాయులకి హెచ్ఎండీఏ ద్వారా కేటాయించిన 17 ఎకరాల భూమి సంగతి ఏమిటని హరీశ్ రావు ముఖ్యమంత్రిని నిలదీశారు.

# వెలుగుమట్ల బాధితులకు వెంటనే న్యాయం చేయాలి





## సిపిఎం పొలిటి బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

**ఖమ్మం( క్రైమ్ మిర్రర్ బ్యూరో ):** వెలుగు మట్ల భూ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కూల్చిన చోటే ప్రభుత్వం బాధితులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని బివి రాఘవులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చిన వెలుగుమట్ల ప్రాంతాన్ని ఆయన సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలకు పైగా వెలుగుమట్లలో ఇళ్లను నిర్మించుకొని 650 మంది పైగా పేద కుటుంబాలు నివసిస్తున్నారని, వారిని 2000 మంది పైగా పోలీసులు మోహరించి ఖాళీ చేయడం దుర్మార్గమని విమర్శించారు. యుద్ధ వాతావరణ న్ని సృష్టించి కోట్ల రూపాయల ఆస్తిని నష్టం చేసి,ఇంతటి విధ్యాసాన్ని ఏ ప్రభుత్వం చేయలేదని తీవ్రంగా ఖండించారు. ఈ చర్య వెనక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో ప్రభుత్వం జిల్లాలోని ముగ్గురు మంత్రులు తెలియజేయాల్సింది అవసరం ఉందనితెలిపారు. ఈ ప్రాంతంలో భూదాన్ 62 ఎకరాలు ఉందని అనేక సందర్భాల్లో అధికారులు,, మీడియా సంస్థలు, ప్రాక్టీస్ వచ్చాయని ప్రకటిస్తూ వచ్చాయని ప్రస్తుతం సమస్య సమస్య 31ఎకరాలలోనిది అని, మిగతా 31 ఎకరాల భూమి సంగతి ఏమిటని ఆయన ప్రశ్నించారు? కేవలం ఆసరా లేని పేదల పైన ప్రభుత్వం ప్రతాపం చూపుతూ, రియల్ ఎస్టేట్, వ్యాపారులకు, సంస్థలకు, ప్రయోజనం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన విమర్శించారు. వారం రోజుల్లో బాధితుల సమస్యను సక్రమంగా పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని, అప్పుడు కూడా పరిష్కారం కాకపోతే ఇండియా బ్లాక్ పార్టీ ల దృష్టికి కూడా తీసుకువెళ్లి జాతీయ స్థాయిలో చర్చ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుదర్శన్ రావు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నాయకులు వై. విక్రమ్ బండి రమేష్ , బుగ్గవీటి సరళ మాచర్ల భారతి ఎర్ర శ్రీనివాసరావు మెరుగు సత్యనారాయణ బొంతు రాంబాబు కళ్యాణ వెంకటేశ్వరరావు, బండి పద్మ, పొన్నం వెంకటేశ్వర్లు బండారు రమేష్ దొంగల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు



## నేరేడుచర్ల లో ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల:** నేరేడుచర్ల పట్టణంలోని పట్టణ టైలర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిపారు. మొదట కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేరేడుచర్ల మండలం చౌరస్తాలో ఎస్ కే చాంద్ పాషా ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించినారు .ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్కే చాంద్ పాషా జండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులైన వారందరికీ నేరేడుచర్ల లో ఇందిరమ్మ ఇల్లు, 50 సంవత్సరాలు నిండిన వాళ్ళకి పింఛన్లు, నిరుపేదలైన టైలర్స్ కి కుట్టుమిషన్లు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు .అనంతరం ఎస్కే చాంద పాషాను బత్తిని శీను ని ఘనంగా వర్కర్స్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్కే బషీర్, ఎస్ కే సైదులు, రాము ,రాజేష్ ,ఎస్కే లతీపు ,రెబ్బ సత్యనారాయణ ,నరేష్ ,శ్రీనివాస చారి ,బాలకృష్ణ ,ఎర్రమాద సైదులు ,లక్ష్మయ్య అంజయ్య, రమేష్ ,మీరా, రఫీ ,వెంకన్న వెంకటేశ్వర్లు, శ్రీను ,అనిత, పద్మ లలిత, వెంకటయ్య, జోసెఫ్ లక్ష్మయ్య ,బాల సైదా, ఆనంద్ చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ తప్పుడు విధానాలే అమెరికా సామ్రాజ్యవాదానికి దారులు వేస్తున్నాయి

### ఎస్ వీరయ్య, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు

**భువనగిరి, ఫిబ్రవరి 28(క్రైమ్ మిర్రర్):** కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ చేస్తున్న తప్పుడు విధానాల వల్ల అమెరికా సామ్రాజ్యవాదం దేశం మీద మరింత పెరుగుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు అధ్యక్షతన జరిగిన వర్క్ షాప్ లో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదాని అంబానీ లాంటి సంస్థలకు రాయితీలను కల్పిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను నిరుగార్చుతూ నిరుద్యోగాన్ని పెంచుతూ, రైతాంగాన్ని దివాలా తీస్తూ పరిపాలన సాగిస్తున్నాడని, అమెరికా భారతదేశం మీద అనేక విధాలుగా సుంకాల పేరుతో పన్నులు పెంచుతున్న కనీసం నోరు మెదపకుండా ఉన్నాడని, రష్యా నుండి చమురు కొనుగోలు చేయకూడదని ఆంక్షలు విధిస్తున్న మోడీ ప్రభుత్వం ఎలాంటి ఖండన ఇవ్వకపోవడం విడ్డూరమని వారు అన్నారు. అదేవిధంగా మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి, నిరుద్యోగం పెరిగింది, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధానాలను తీసుకొచ్చి వ్యవసాయ కూలీల పొట్టగొట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తుందని దీనికి తోడుగా గ్రామాలలో 125 రోజులు పని కల్పిస్తున్నామని తప్పుడు ప్రచారాలు చేసుకుంటుందని వారు అన్నారు. రానున్న కాలంలో ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే ప్రయత్నం బిజెపి చేస్తుందని,




అదేవిధంగా విద్యుత్ సవరణ బిల్లును తీసుకొచ్చి పేదవాడికి విద్యుత్ భారాన్ని మరింత పెంచే విధంగా మోడీ ప్రభుత్వ విధానం ఉందని, పేద మధ్యతరగతి ప్రజలకు ఇవ్వని రాయితీలు పెట్టుబడుదారులకు కాంట్రాక్టర్లకు ఇస్తున్నాడని వారు అన్నారు. గతంలో నల్ల చట్టాలను తీసుకురావడం రైతుల పోరాటంతో రైతాంగానికి మద్దతు ధరను ఇస్తామని చెప్పి నూతనంగా విత్తన చట్టాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాడని దీని ద్వారా వ్యవసాయ రంగం దివాళ తీసే అవకాశాలు ఉన్నాయని వారు అన్నారు. కార్మికుల పొట్టకొట్టే లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మిక వర్గంపై మరింత పని ఒత్తిడిని పెంచాలని బిజెపి చూస్తుందని వారన్నారు. బీహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు చేసి అధికారంలోకి రావడం జరిగిందని ఇదే పనిని ఇతర రాష్ట్రాలలో చేయాలనే ప్రయత్నం బిజెపి చేస్తుందని సిబిఐ, ఈడిని తన గుప్పెట్లో ఉంచుకొని రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని తప్పుడు ఆర్థిక విధానాలు అనుసరిస్తూ మతోన్మాదాన్ని పెంచడం లాంటి పనులు బిజెపి చేస్తుందని వారు అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర జాతరలో కుల దురహంకారానికి బలైపోయిన రెండు నెలల పసికందు కుటుంబానికి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం చేయలేదని దోషులను శిక్షించలేదని వారు గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా తొలగించిన ఇండ్లను వెంటనే నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే పత్తి కొనుగోలు చివరి దశ చేరుకున్న సీసీఐ కేంద్రాల్లో దళారుల వ్యాపారాలు అధికమయ్యాయి తప్ప రైతులకు జరిగిన లాభం ఏమీ లేదని కపాస్ యాప్ తీసుకువచ్చిన రైతులకు జరిగిన మేలు ఏమీ లేదని వారు అన్నారు. అదేవిధంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో యాదాద్రి భువనగిరి జిల్లాకు నిధులు కేటాయింపు విషయంలో అన్యాయం చేసిందని ప్రస్తుతం ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్లో జిల్లా అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య బూరుగు కృష్ణారెడ్డి గుంటోజు శ్రీనివాసాచారి జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, మద్దెల రాజయ్య, ఎండి పాష, బొడ్డుపల్లి వెంకటేష్ ,గుండు వెంకటనర్సు, గంగదేవి సైదులు, మద్దేపూరం రాజు ,బోలగాని జయరాములు, ఎంఎ ఇక్బాల్, గడ్డం వెంకటేష్ రాగిరు కిష్టయ్య, బల్గూరి అంజయ్య, గోశిక కరుణాకర్, నాయకులు పల్లెర్ల అంజయ్య, ధూపటి వెంకటేష్, ర్యాఖల శ్రీశైలం, పోతరాజు జహంగీర్, లావుడియా రాజు, ఈర్లపల్లి ముత్యాలు, వడ్డేబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీల పెంపకం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### హరిత హారం విజయవంతానికి నర్సరీ లే కీలకం

### మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం



**కోదాడ ఫిబ్రవరి 28 క్రైమ్ మిర్రర్:** కోదాడ ఉత్తమ్ పద్మావతి నగర్ లో నర్సరీ, వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్నీ పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు.హరిత కోదాడ నర్సరీలతో నే సాధ్యం అవుతుందని, అధికారులు , సిబ్బంది నర్సరీల పెంపకం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తీసుకోవాలనీ కోదాడ తాజా మునిసిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు అన్నారు. శని వారం కోదాడ పట్టణం లోని ఉత్తమ్ పద్మావతి నగర్ లో నర్సరీ, వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్నీ ఆమె పరిశీలించి మాట్లాడారు. నర్సరీ లో పెంచుతున్న మొక్కల మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవి తీవ్రత కు మొక్కలు ఎండి పోకుండా నిత్యం నీరు పోస్తూ వాటిని సంరక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మొక్కల తోనే సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కు వేల కోట్ల రూపాయలు వ్యయం చేస్తుందని ఆ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్నీ పరిశీలించి , అధికారులు ఈ కేంద్రాన్ని వినియోగం లోకి తేవాలన్నారు. పచ్చదనం, పరి శుభ్రత కు మునిసిపల్ పాలక వర్గం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఈఈ భవాని, సీనియర్ నాయకులు కొల్లు క్షత్రయ్య, దేవమని ఉన్నారు.

## కుమ్మర గ్రామ ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) కుమ్మర గ్రామ పెత్తందారులను అరెస్టు చేసి బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలంటు కార్మిక, ప్రజా సంఘం, రజక సంఘం, సిఐటియు సంఘం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొమ్మెర ఘటనపై న్యాయం కోరుతూ మీర్పేట్ చౌరస్తాలో పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు నిరంతరం పోరాటం చేస్తామని కుమ్మర గ్రామంలో మల్లన్న స్వామి ఉత్సవాలలో ఈ సంఘటన చోటు చేసుకోవడం జరిగిందని, బాధిత కుటుంబానికి 5 ఎకరాల భూమి, ఉద్యోగం, కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం, జిల్లా అధ్యక్షులు ఉమేష్, జిల్లా కార్యదర్శి మల్లేష్, రజక సంఘం కార్యదర్శి మల్లేష్, సిఐటియు జిల్లా నాయకులు దాసరి బాబు, సిపిఎం పార్టీ మండల నాయకులు శేఖర్ యాదవ్, సిఐటియు నాయకుడు లక్ష్మారెడ్డి, రజక సంఘ నాయకులు పెండ్యాల బాబు, వెంకటయ్య, పెండ్యాల ఉమేష్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.







## కోదాడ బాలుర పాఠశాలలో సైన్స్ దినోత్సవం

### విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం

**కోదాడ ఫిబ్రవరి 28 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కోదాడ బాలుర పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబువిద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పరిశోధన రంగాల్లో రాణించి శాస్త్రవేత్తల ఆశయాలను సాధించాలన్నారు.సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సలీం షరీఫ్ చైర్ పర్సన్ కు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్వావమ్మ సైదీ బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.



## ముమ్మరంగా సామాజిక ఆర్థిక సర్వే

### అర్హులైన పేదలకు ఇంటి స్థలం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### సంబంధించిన వ్యక్తులు సర్వేకు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలో ఫిబ్రవరి 24న భూదాన్ భూములలో చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో ఇండ్లు కోల్పోయిన వ్యక్తుల సామాజిక ఆర్థిక సర్వే ముమ్మరంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 21 మంది తహశీల్దార్లకు సంబంధిత వ్యక్తుల సామాజిక ఆర్థిక సర్వే చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేయగా ఇప్పటి వరకు ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన 182 మంది ఖమ్మం జిల్లాలోని ఇతర మండలాలకు చెందిన వారు 340 మంది ఉన్నారని అలాగే రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందినవారు 107 మంద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ముగ్గురు ఉన్నట్లు తెలిపారు.సర్వే ప్రక్రియ కొనసాగుతుందని యుద్ధప్రాతిపదికన పూర్తికి చర్యలు చేపట్టినట్లుపూర్తి అయిన తర్వాత అర్హులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. సర్వే కు సంబంధించిన వ్యక్తులువారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి సామాజికఆర్థిక సర్వేకు సహకరించాలి

# నేటి విద్యార్థులే... రేపటి శాస్త్రవేత్తలు

## సోలిటైర్ గ్లోబల్ స్కూల్‌లో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన.. ప్రిన్సిపాల్ అనిల్ వసంత్

గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడతాయని సోలిటైర్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిల్ వసంత్ అన్నారు. శనివారం కాటేదాన్ సోలిటైర్ గ్లోబల్ స్కూల్ లో విద్యార్థిని, విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించడంతోపాటు సమాజానికి ఉపయోగపడే ఎన్నో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలను విద్యార్థుల తల్లి తండ్రులు తిలకించి వాటి ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ గ్రూప్స్, షుగర్ టెస్ట్, హైట్ వంటి పరీక్షలు విద్యార్థులు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... చిన్ననాటి పరిశోధనలే భవిష్యత్తులో గొప్ప ఆవిష్కరణలకు పునాది అని, పిల్లల ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఏ అంశంలోనైనా ప్రయోగాత్మకంగా అధ్యయనం చేయడం నేర్చుకోవాలన్నారు. సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మెరుగైన సమాజం కోసం ఎటువంటి ప్రాజెక్టులు అవసరం అనేది విద్యార్థి దశనుంచి అలవర్చుకోవడం ద్వారా మెరుగైన సమాజం ఏర్పాటులో




భాగస్వాములు అయ్యేందుకు వీలుగా ఉంటుందన్నారు. సైన్స్ ద్వారానే మెరుగైన సమాజం ఏర్పడుతుందని విద్యార్థుల ప్రదర్శనలు నిరూపించాయన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా మార్చేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వర్షం నీటి సంరక్షణ, రోబోటిక్స్, సాంకేతిక కళ, వాయు కాలుష్య నియంత్రణ, సోలార్ సిస్టం, నానో టెక్నాలజీ, అటవీ పర్యావరణ వ్యవస్థ, ప్రతిబింబం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అముక్త రెడ్డి, ఉపాధ్యాయులు మల్లేష్, అర్జున్, విశాల్, ఖాజా, సుజాత రావు, రూబీనా, సరిత తివారి, ఉమా ఐరా, రిజ్వి, లలిత, వైష్ణవి, మాధవి, రహమాత్, ఆఫ్సార్, అమృత, బబితా, మౌనిక, సునీత, లక్ష్మి,హారతి, హుమెరా, సాన ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరం మరియు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను ప్రారంభించిన కమిషనర్ సృజన...

**మాదాపూర్ క్రైమ్ మిర్రర్** : మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీ లో దివ్య శ్రీ శక్తి అపార్టుమెంట్స్ లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ మరియు నారెడకో తెలంగాణ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం మరియు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ఐఏఎస్ , మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు , ఉప్పలపాటి శ్రీకాంత్ ల తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పీ ఏ సీ చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ మరియు నారెడకో తెలంగాణ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం మరియు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను ఏర్పాటు చేయడం చాలా అభినదనియం అని, ఇక్కడి పరిసర ప్రాంత పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు గత ఆరు నెలలుగా నిరంతరంగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ ను ప్రారంభ దశలోనే గుర్తించి, చికిత్స చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి అని, కావున ప్రతి ఒక్కరు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని, ఎటువంటి లక్షణాలు లేనప్పుడే క్యాన్సర్ కణాలను లేదా ముందుగా క్యాన్సర్‌గా మారే అవకాశం ఉన్న కణజాలాన్ని (ప్రీ-కాన్సర్స్ ) ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు సహాయపడతాయి. ఇది వ్యాధి ప్రారంభ దశలోనే చికిత్సను సులభతరం చేసిప్రాణాపాయాన్ని తగ్గిస్తుంది తెలియజేశారు . రొమ్ము (మామోగ్రఫీ)గర్భాశయ (పాప్ స్మెర్)పెద్దప్రేగు (కొలనోస్కోపీ) క్యాన్సర్లకు ఇవి బాగా ఉపయోగపడతాయి అని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రిమింగ్ పరీక్షలు చేసుకోవాలని ఎంతో ఉపయోగపడుతుంది అని, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని పీ ఏ



సీ చైర్మన్ గాంధీ తెలియజేశారు . ఉచిత మెగా వైద్య శిబిరం లో భాగంగా. జనరల్ మెడిసిన్ సంబంధించిన వైద్యులు ,స్త్రీల వైద్యులు , చిన్న పిల్లల వైద్యులు, ఎముకలకు సంబంధించిన వైద్యులు, చర్మ వైద్యులు, నేత్ర వైద్యులు, న్యూ రాలజిస్ట్,ఈ ఎన్ టీ , వైద్యులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా అందించడం అభినందనీయం అని,పీ ఏ సీ చైర్మన్ గాంధీ డాక్టర్లను శాలువతో సన్మానించడం జరిగినది. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో 18 రకాల రక్త పరీక్షలు, బీపీ, షుగర్,గైనకలజీ,ఆర్థో,ఈసీజీ , ఈ ఎన్ టీ దంత పరీక్షలు, కంటి పరీక్షలు, ఎక్సరే అర్హులైన వారికి ఉచిత కళ్ళజోడులు, ఉచిత మందులు పంపిణీ వంటి మొదలగు సేవలు ఒకే చోట ఏర్పాటు చేయడం జరిగినది అని ,పేద ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవడం చాలా అభినందనియమని ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దృక్పథంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించడం అభినందనీయమని ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం చాల గొప్ప విషయం అని, పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని వారు కొనియాడారు. పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియశారు .మానవతా దృక్పతం తో ఉచితంగా మందులు పంపిణి చేసి పేదల వద్దకు నాణ్యమైన వైద్యాన్ని అందించడం ప్రభుత్వ లక్ష్యం అని ,ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యము పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పీ ఏ సీ చైర్మన్ తెలియజేసారు. ఈ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినదించడం జరిగినది. ప్రతి ఒక్కరు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అంతే కాకుండా సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

ఈకార్యక్రమంలో నారెడకో తెలంగాణ ప్రెసిడెంట్ మేకా విజయ్ సాయి, ట్రెజరర్ వెంకటేశ్వర రావు, ఠాగూర్, నారెడకో వెస్ట్ జోన్ జనరల్ సెక్రటరీ కేవ్ ప్రసాద్ రావు మరియు అపార్ట్మెంట్ వాసులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సైన్స్ డే...

మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని సంతోష్ రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సర్ సి.వి. రామన్ ఆవిష్కరణకు గుర్తుగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చైర్మన్ ఎస్. సంతోష్ రెడ్డి, ప్రిన్సిపాల్ సిహెచ్. జనకమ్మ రెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు. విద్యార్థులు తమ నమూనాల పనితీరును వివరించిన తీరును ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆసక్తిగా వీక్షించి వారిని అభినందించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని, భవిష్యత్తులో మరిన్ని అద్భుత ఆవిష్కరణలతో పాఠశాలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో చిన్నారి సత్తా



**చింతపల్లి(క్రైమ్ మిర్రర్):** ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ 2026, ఫలితాల్లో నల్లగొండ జిల్లాకు చెందిన సాన్వీ సాగర్, అద్భుత ప్రతిభ కనబరిచి వార్తల్లో నిలిచారు. జాతీయ స్థాయిలో 1393వ ర్యాంకు సాధించి నల్లగొండ జిల్లా గర్వపడేలా చేశారు. ?సాన్వీ సాగర్ సాధించిన ఈ విజయంలో ప్రధాన ఆకర్షణ, ఆమె గణిత శాస్త్రంలో సాధించిన 150/150 మార్కులు. అత్యంత కఠినంగా భావించే మ్యాథ్స్‌లో, ఒక్క మార్కు కూడా తగ్గకుండా పూర్తి మార్కులు సాధించడం ఆమె మేధస్సుకు, పట్టుదలకు నిదర్శనమని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు. చింతపల్లి మండలం, గోడుకొండ్ల(మాల్ టౌన్)కి చెందిన, సందుపట్ల లక్ష్మణ్ సాగర్ ప్రేమలత దంపతుల కూతురే సాన్వి.. చదువులో ఎంతో క్రమశిక్షణతో, సైనిక్ స్కూల్ వైపు అడుగులు వేసిందని ఆమె కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సాన్వీ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశ రక్షణ రంగంలో రాణించాలని గ్రామస్థులు, స్నేహితులు ఆకాంక్షిస్తున్నారు.

## భువనగిరి జిల్లా జడ్జ్ జయరాజు సమావేశం



క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28: యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కోర్టు భవనములో నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగులో ఉన్న క్రిమినల్ కేసులును,నాన్ బెయలబుల్ వారంట్లు, జైలులో ఉన్న ఖైదీల కేసుల పరిష్కారం అంశాలపై చర్చించి, త్వరితగతిన కేసుల పరిష్కారం, పెండింగ్ జాప్యాన్ని తగ్గించటం, జైలులో ఉన్న వారి కేసులు పరిష్కారం, న్యాయ సహాయం, సాక్షి రక్షణ పథకం, 2018 అమలు అంశాలపై చర్చించి తగు సూచనలను జిల్లా న్యాయధికారులకు, పోలీసు వారికి జారి చేసారు మరియు మార్చి 28వ తేదీన జాతీయ లోక్ ఆదాలత్ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ప్రాంగణములలో నిర్వహించబడుతాయని, ఈ అవకాశాన్ని కక్షిదారులు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి ముక్తిదా, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత, అదనపు సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ లక్ష్మి నారాయణ, సబ్ జైలు సురింటెండెంట్ నెహ్రూ పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి కి ఘనంగా సన్మానం.

క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సాత ప్రవీణ్ కుమార్ మరియు భాస్కర్ రెడ్డి లకి ఘనంగా సన్మానం చేశారు. సన్మానం చేసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. సన్మానం చేసిన వారిలో రఘునందన్ రెడ్డి, రాజేష్ గౌడ్,మార్కెట్ కమిటీ మెంబర్ భాస్కర్ రెడ్డి,రవీందర్(అడ్వకేట్ ), పర్వేద వార్డు మెంబర్ రవి,పర్వేద సేవదల్ అధ్యక్షులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో సాక్షి దినపత్రిక రిపోర్టర్ విజయ్ కుమార్ నూతన నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం సత్య నారాయణ వ్రతం కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొలుసని భీంరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అధికారంలోనికి వచ్చిన రెండు సంవత్సరాలలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి గృహ ప్రవేశం చేయడం ఒక కాంగ్రెస్ ప్రభుత్వంలోనేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల గ్రామ మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, వార్డు సభ్యులు టి.రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కడుమూర్ రాంరెడ్డి, వార్డు సభ్యులు చాకలి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందరరాజన్‌కు నివాళులు అర్పించిన మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి



గండిపేట(క్రైం మిర్రర్): ప్రముఖ పుణ్యక్షేత్రం చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు సౌందరరాజన్ సేవలు ఎంతో గొప్పవని చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. సౌందర రాజన్ మరణవార్త తెలుసుకున్న వెంటనే ఆయన నివాసానికి చేరుకోని మృతదేహానికి నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిలుకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకోచ్చిన మహనీయులని కొనియాడారు.

## శిల్పారామం లో ఖాదీ మేళ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు...




మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : శిల్పారామం మాదాపూర్ లో ఖాదీ మేళ 2026 సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం భరతనాట్యం మరియు ఆంధ్రనాట్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. చెన్నై నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి కుమారి పూర్ణిమ తన ప్రదర్శనలో "ఆవిర్భావ – ది మానిఫెస్టాటిన్ అఫ్ ఎల్లమ్మ " అంశాన్ని ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి రేఖ గరిష్యకృతి శిష్య బృందం ఆంధ్ర నాట్య ప్రదర్శనలో కుంభహారతి, అలరింపు, వినాయక కౌతం, శాంతి సహిత, నృత్యతి నృత్యతి, సామగాన ప్రియే,మంగళాలయ, తిల్లాన అంశాలను యాష్మిత, మోక్షిత, సాన్విక, శోభా, సాయి అనన్య రెడ్డి, రాధాకృష్ణ, సమంత, ప్రణతి, షణ్ముఖ, ఉజ్వల, సాన్విక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# సీపీఐ జెండాను ఎగరేసిన యోధుడు కురుమిద్ద లింగయ్య

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

### సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 28(క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లోని కోతులాపురం గ్రామంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు అమరజీవి కురుమిద్ద లింగయ్య 3 వర్ధంతి సభ పోరాట స్ఫూర్తి ని తలపించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగయ్య లాంటి నాయకులు చాలా అరుదుగా పుడతారని, ఆయన జీవితం మొత్తం పేదలు కార్మికులు రైతుల కోసం అంకితం చేశారని అన్యాయానికి ఎదురు నిలబడి చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడు లింగయ్య అని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీ పడని నాయకత్వమే లింగయ్య ప్రత్యేకత అని పేర్కొన్నారు. సిపిఐ సిద్ధాంతాల కోసం అనేక కష్టాలు భరించి కట్టుబడి ఉద్యమాల్లో ముందుండి పోరాటం నడిపిన నాయకుడని అన్నారు. నేటి రాజకీయాల్లో విలువలు క్షీణిస్తున్న వేళ లింగయ్య చూపిన మార్గం అందరికీ ఆదర్శమని లింగయ్య ఆశయాలను కొనసాగించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, కె శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య,కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు పొట్ట శంకరయ్య, సురవి నరసింహ, స్థానిక సర్పంచ్ కురుమిద్దె వినోద, మాజీ సర్పంచ్ పొట్ట సత్యం, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రశ్నించే తత్వంతోనే విజ్ఞాన వికాసం....

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** సైన్స్ డేను పురస్కరించుకొని సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి ఆధ్వర్యంలో ప్రభుత్వ సెకండరీ పాఠశాల మాదాపూర్‌లో సైన్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రావు వహించగా ముఖ్య అతిథిగా ఐసిఎఆర్–క్రిడా అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సైన్స్ రైటర్ డాక్టర్ స్నేహ వర్గీస్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సైన్స్ అవగాహన అవసరమని, ఆలోచనా శక్తిని పెంపొందించుకొని ప్రశ్నించడం అలవర్చుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు తమ మేధస్సుతో సైన్స్ ద్వారా అనేక పరికరాలను కనుగొన్నారని, సి వి రామన్, ఐన్‌స్టీన్, మేడం క్యూరీ వంటి మహానుభావుల కృషిని ఉదాహరణగా వివరించారు. న్యూట్రాన్లు, పరమాణువులు, రసాయనాలు తదితర అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఎస్వికె బాధ్యులు అనిల్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని చైతన్యవంతులు కావాలని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకొని వాస్తవాలను గ్రహించి మూఢనమ్మకాలను విడనాడాలని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం సైన్స్ డే, బాలోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని లైబ్రరీ అందరికీ అందుబాటులో ఉందని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీదర్ రెడ్డి, రోజా రాణి, మనోహర్, ఎస్వికె సిబ్బంది ప్రకాష్‌తో పాటు సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు.






## మీటర్ రీడర్లకు 30 రోజుల పని దినాలు కల్పించాలి

### విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఫిబ్రవరి 28:** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు నెలలో 30 రోజుల పూర్తి పని దినాలు కల్పించాలని మిర్యాలగూడ డివిజన్ విద్యుత్ మీటర్ రీడర్స్ పీస్ వర్కర్స్ యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. తమ సమస్యలపై విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డివిజన్, రాష్ట్ర నాయకులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాచకొండ వెంకన్న, సీతారాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత 15 సంవత్సరాలుగా మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి స్తంభాలు ఎక్కుతూ, లైన్‌మెన్‌ల కింద విధులు నిర్వర్తిస్తూ పూర్తి బాధ్యతతో సేవలు అందిస్తున్నారని తెలిపారు. మీటర్ రీడింగ్‌తో పాటు మిగిలిన రోజులకు కూడా పని దినాలు కల్పించడం న్యాయసమ్మతమైన కోరిక అని పేర్కొన్నారు.రెండవ తారీకు నుంచి మీటర్ రీడింగ్ పనులను బహిష్కరించి హైదరాబాద్‌లో ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేపట్టిన కార్మికులతో విద్యుత్ శాఖ యాజమాన్యం వెంటనే చర్చలు జరిపి, వారికి సంబంధించిన న్యాయబద్ధమైన విధులను అప్పగించాలని సంఘం కోరింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ బీసీ సంఘ నాయకులు కోచం మారయ్య, కోటేశ్వరరావు, మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు మునీర్, శ్రీకాంత్, సైదా, అజయ్ నాయక్, మనసురాలి, కోటేష్, నాగార్జున, కరుణాకర్ రెడ్డి, శ్రీను, వినోద్ కుమార్, రాము, మహేష్, నాగరాజు, ప్రశాంత్, శశిధర్, మేష్ నాయక్, మల్లేష్, కొంపెల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్య అందించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత - శ్రీరాములు అందెల

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ డివిజన్ లోగల ప్రెస్ కాలనీలో డి.ఆర్.ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ వారు నిర్వహించినటువంటి టాలెంట్ ఎక్స్–పో 360 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ యాజమాన్యం శ్రీరాములుని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, పర్యావరణ పరిరక్షణ, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, రోబోటిక్స్ వంటి విభిన్న రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, సృజనాత్మక ప్రాజెక్టులు, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి టాలెంట్ ఎక్స్–పో కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ఆచరణాత్మక విద్య, సృజనాత్మక ఆలోచనలతో ముందుకు రావడం అవసరం అన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని వారికి నాణ్యమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం అందించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, బిజెపి నాయకులు అంకంగారి రవి గౌడ్, నర్సింగ్ యాదవ్, శ్రీధర్ సత్యనారాయణ కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.



# లిక్కర్ కేసు అనేది ఒక రాజకీయ ప్రేరేపిత కేసు : కప్పాటి పాండురంగారెడ్డి

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) లిక్కర్ స్కాం అనేది ఓ రాజకీయ ప్రేరేపిత కుట్ర అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. ?నిన్నటి వరకు రాజకీయాల్లో మాపై బురదజల్లడానికి, మమ్మల్ని హేళన చేయడానికి గిట్టని వారికి ఉన్న ఏకైక అస్త్రం లిక్కర్ కేసు ఏ చర్చ జరిగినా, ఏ అంశం వచ్చినా ఆఖరుకు ఈ నిరాధారమైన ఆరోపణల దగ్గరికే తీసుకొచ్చి, అపహాస్యం చేసేవారు. ఎంత నిజాయితీగా ఉన్నా ఆ మరక చూపి రాజకీయంగా ఎదుర్కోవాలని కుట్రలు పన్నారు. కానీ, ఊహించని విధంగా కొన్ని రోజుల్లోనే రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది ధర్మం గెలిచింది ఇక రాజకీయాల్లో మాపై ఎలాంటి నెగెటివ్ నరేషన్ లేదు, అంతా పాజిటివ్ వైబ్ మాత్రమే,?సాధారణంగా మన దేశంలో కుంభకోణాల కేసుల విచారణలు, తీర్పులు రావడానికి దశాబ్దాల కాలం పడుతుంది. దేశ చరిత్రను ?ఒక సినీ నటి హత్య కేసులో తీర్పు రావడానికి ఏకంగా 24 ఏళ్ళు, ?దాణా కుంభకోణం కేసులో తొలి తీర్పు రావడానికి 17 ఏళ్లు, హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ కుంభకోణం తీర్పుకు 11 ఏళ్లు, ?సత్యం కార్పొరేట్ ఫ్రాడ్ కేసులో తీర్పుకు 6 ఏళ్లు పట్టిందని, జగన్ కేసు గత 13 ఏండ్లుగా, ?ఓటుకు నోటు కేసు 11 ఏండ్లుగా ఇంకా నడుస్తూనే ఉందని, ??ఇలాంటి పరిస్థితుల్లో, ఒక కుంభకోణం అంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ లిక్కర్ కేసు తీర్పు రావడం కూడా అంత ఈజీ కాదని, బహుశా జీవితకాలం పడుతుందేమో అని అందరూ భావించారు. పైగా ఆయా కుంభకోణాల్లో న్యాయస్థానాలు నేరాలను నిర్ధారించి, దోషులకు శిక్షలు కూడా విధించాయి. ?కానీ, లిక్కర్ కేసు అనేది అసలు ఒక స్కామే కాదు! ఇదొక రాజకీయ ప్రేరేపిత కేసు అని, కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ తప్పుడు ఆరోపణలు చేశారని గౌరవ న్యాయస్థానం స్పష్టం చేసింది. అందులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్న వారికి పూర్తి స్థాయి “క్లీన్ చిట్” ఇచ్చి, వారి నిజాయితీని లోకానికి చాటిచెప్పి, ?సత్యమేవ జయతే అని మరోసారి నిరూపితమైంది. ఈ తీర్పుతో రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైందని కప్పాటి పాండురంగా రెడ్డి తెలిపారు.



# ఎలిమినేటి మణిత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు

### తెలిపిన ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు మారగోని శ్రీనివాస్ గౌడ్



క్రైమ్ మిర్రర్ వలిగొండ:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్ పురం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఏజేఆర్ ఫౌండేషన్ ఫౌండేషన్ అధినేత బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి లలితల చిన్న కుమారుడు ఎలిమినేటి మణిత్ రెడ్డి జన్మదిన సందర్భంగా వలిగొండ మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు మారగోని శ్రీనివాస్ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలిమినేటి మణిత్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోని ఉన్నత శిఖరాలు,అధిరోహించాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆశీర్వదించారు.

# నేటి నుంచి పాలేరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు

### వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో ):** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కరుణగిరిలో ర మార్చి 1 నుంచి పాలేరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. కరుణగిరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ టోర్నీ వాల్‌పోస్టర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. 8 ఓవర్ల ఫార్మాట్‌లో సాగే ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా ?25,000, ద్వితీయ ?15,000, తృతీయ ?10,000 నగదు అందజేయనున్నారు. ఆసక్తి గల జట్లు ?799 ఎంట్రీ ఫీజుతో పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు 99121 89317 నంబర్‌ను సంప్రదించవచ్చు.



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# పువ్వాడ ఉదయ నగర్ లో డంపింగ్ యార్డ్ నిర్మాణం మానుకోవాలి

**ఆ ఖాళీ స్థలంలో చెరువు ను ఏర్పాటు చేయాలి**

**బి వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి డిమాండ్**



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** రఘునాధపాలెం మండల పరిధిలో గల పువ్వాడ ఉదయ నగర్ లో డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే అధికారులు ఉపసంహరించుకోవాలి ఆ ఖాళీ స్థలంలో గ్రామ ప్రజలకు పనికి వచ్చే చెరువును నిర్మాణం చేయాలని వీర నారి సావిత్రిబాయి పూలే కార్యాలయంలో జరిగిన సమావేశంలో వీరారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి డిమాండ్ చేశారు . శనివారం ఆమె గ్రామస్తులకు కలసి డంపింగ్ యార్డ్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు . నిర్మాణ పనులను నిర్వహిస్తున్న వారితో పనులను ఉపసంహరించుకోవాలని కోరారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పువ్వాడ ఉదయ నగర్ ప్రజల నివాస స్థలానికి సుమారు అరకిలో మీటర్ దూరంలో గల శివాలయం సమీపంలో ఈ డంపింగ్ యార్డ్ నిర్మాణం పనులను అలా పెట్టడం ఏమాత్రం సమంజసం కాదన్నారు . ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రాలను సమర్పించామని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు ఉన్నతాధికారులు ఈ విషయంలో గ్రామ ప్రజలతో సంప్రదించి ఏకాభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. మండలం మొత్తానికి డంపింగ్ యార్డ్ పువ్వాడ ఉదయ నగర్ లో అది కూడా జన వాసానికి కూత వేటు దూరంలోనే నిర్మాణం చేయడం ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రమాదం చూపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరంలోనే ఇదే స్థలంలో చెరువు నిర్మాణానికి తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ అధికారులు డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని ఉపసంహరించుకొని వెంటనే చెరువు నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ అంశంపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను తలపెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మాదాపూర్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు....

**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమించే మాదాపూర్ పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆసుపత్రి వారి సౌజన్యంతో సిబ్బందికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్ రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ శిబిరంలో భాగంగా సిబ్బందికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, షుగర్, రక్తపోటు, కిడ్నీ పనితీరును తెలిపే క్రియాటినిన్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారని పేర్కొన్నారు. పరీక్షల అనంతరం కిడ్నీ సంబంధిత వ్యాధుల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. రక్తంలో క్రియాటినిన్, సీరమ్ స్థాయిల ప్రాముఖ్యతను వివరించారు. కిడ్నీల ఆరోగ్యానికి ప్రతిరోజూ తగినంత నీరు త్రాగాలని, ఆహారంలో ఉప్పు వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని సూచించారు. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు నియంత్రించుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను దూరం పెట్టవచ్చని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

## ప్రగతి మహిళ సామాజిక సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మహేశ్వరం నియోజకవర్గం జీహెచ్ఎంసీ పరిధిలోని నాదర్ గుల్ డివిజన్ జయసూర్య పట్నం కమ్యూనిటీ హాల్ లో ప్రగతి మహిళ సామాజిక సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలని వాసులతో పాటు మహిళలకు క్యాన్సర్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, టూడి ఇకో, కంటి, పంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, నాయకులు బంగారి అశోక్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ కో ఆర్డినేటర్ వెంకటేష్ గౌడ్, నర్సింగ్, గడ్డం మాధవ రెడ్డి, నాగరాజు కాలని అధ్యక్షుడు సాయి బాబు వైద్య శిబిరం నిర్వాహకులు శ్రీలత రాణి, సేవా సంస్థ అధ్యక్షులు సుధారాణి సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి అరుణోదయ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కి సన్మానం: కాసెట్టి చంద్రమోహన్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్ పల్లి మండల పరిధిలో గల అరుణోదయ యూత్ క్లబ్ కి నూతనంగా ఎన్నికైన కాశెట్టి మోహన్ కి సన్మానం చేసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.సన్మానం చేసిన వారిలో రఘునందన్ రెడ్డి, రాజేష్ గౌడ్,మార్కెట్ కమిటీ మెంబర్ భాస్కర్ రెడ్డి,రవీందర్(అడ్వకేట్ ), పర్వేద వార్డు మెంబర్ రవి,పర్వేద సేవదల్ అధ్యక్షులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# ముదిగొండ ప్రాంతీయ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆఫీస్ ప్రారంభం

**ఆఫీస్ ప్రారంభించిన పొంగులేటి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ దయాకర్ రెడ్డి**





**ఖమ్మం( ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ముదిగొండ ప్రాంతీయ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆఫీస్ ని పాలేరు నియోజకవర్గశీ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్డు వద్ద నూతన కార్యాలయాన్ని పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పఠాన్ యాకుబ్ షావలి (పాషా) కార్యదర్శి వల్లభనేని సాయిచరణ్ ఉపాధ్యక్షులు బెక్కం కనకయ్య కోశాధికారి రుద్రగాని మాధవరావు కన్వీనర్ మామ సిరాజ్ లు తమరు దయాకర్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో గ్రానైట్ రైస్ వ్యాపారాలకు ప్రసిద్ధి చెందిందని ఐక్యమత్యంతో లారీ అసోసియేషన్ అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ వారు ముఖ్య అతిధులను శాలువా తో సత్కరించి మూమెంటో ను అందించారు. ఈ కార్యక్రమం లో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ గ్రానైట్ అసోసియేషన్ సెక్రెటరీ కమర్తపు గోపాలరావు ఖమ్మం జిల్లా గ్రానైట్ మార్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కిషన్ జానీమియా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ నేలకొండపల్లి మాజీ సర్పంచ్ మామిడి వెంకన్న అంబటి సుబ్బారావు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు వెంపటి వెంకన్న గుర్రం రాకేష్ రెడ్డి భద్రా చారీ తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ కమిషనరేట్ హోంగార్డ్స్ సంఘం ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ కిషన్ నాయక్‌కు వీడ్కోలు సన్మానం

**నూతనంగా హోంగార్డ్ ఆర్గనైజేషన్ బాధ్యతలు చేపట్టిన ఆర్ఎస్ఐ నయీమ్ కు స్వాగతం**



**బాలానగర్, ఫిబ్రవరి 28 (క్రైమ్ మిర్రర్):** బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్‌లో అభినందన కార్యక్రమం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డ్స్ ఆర్గనైజేషన్‌లో గత నాలుగు సంవత్సరాలుగా హోంగార్డ్స్ సంక్షేమం కోసం కృషి చేసిన ఆర్ఎస్ఐ కిషన్ నాయక్ కు వీడ్కోలు ఘన సన్మానం నిర్వహించారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన సందర్భంగా హోంగార్డ్స్ సంఘం ఆధ్వర్యంలో హెచ్ఏఎల్ బాలానగర్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. హోంగార్డ్స్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడంలో కిషన్ నాయక్ విశేష పాత్ర పోషించారని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. సేవాభావం తో పని చేసి హోంగార్డ్స్‌కు అండగా నిలిచిన ఆయన సేవలను స్మరించుకుంటూ పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా, నూతనంగా హోంగార్డ్ ఆర్గనైజేషన్ బాధ్యతలు చేపట్టిన ఆర్ఎస్ఐ నయీమ్ కు స్వాగతం పలుకుతూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో హోంగార్డ్స్ సంక్షేమం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బాలానగర్ జోన్ ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ వసంత రెడ్డి ని కూడా సన్మానించారు. హోంగార్డ్స్ సేవలు శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి సంఘం కట్టుబడి ఉందని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంగార్డు ఉపాధ్యక్షుడు అశోక్, సైబరాబాద్ హోంగార్డ్స్ ఏఎస్ఎన్ మూర్తి, బి. గోపాల్, మన్మధరావు, లక్ష్మణ్, శర్మ, నరేష్, బుచ్చయ్య, లక్ష్మీనారాయణ, సంగన్న తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హోంగార్డ్స్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హోంగార్డ్స్ సంక్షేమం కోసం కృషి చేసిన అధికారులను గౌరవించడం ద్వారా సంఘం ఐక్యతను చాటిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. ఈ సన్మాన కార్యక్రమం హోంగార్డ్స్‌లో నూతనోత్సాహాన్ని నింపింది.

## విద్యార్థుల ప్రతిభ అభినందనీయం... పాపిరెడ్డి నగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి

**రెయిన్బో పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 28 (క్రైమ్ మిర్రర్) :** సైన్సె ఫెయిర్ లో విద్యార్థులు చేపట్టిన వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలు అభినందనీయమని పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. బస్తీ లోని రెయిన్బో హై స్కూల్ లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనను తిలకించిన చంద్రారెడ్డి సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక నైపుణ్యాలను వెలికి తీసే ఆస్కారం ఉందన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణిస్తూ తల్లిదండ్రులకు, గురువులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావడంతో పాటుగా దేశానికి ఉపయోగపడేలా తయారు కావాలని తెలియజేశారు. కార్యక్రమంలో నేతలు వెంకటేష్, వనం ఆంజనేయులు, కనకా రెడ్డి, శంకర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో యువత విద్యా, ఉద్యోగం,ఉపాధి హక్కుల సాధనకై ఉద్యమించాలి



**డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మధు**

**ఖమ్మం ( క్రైమ్ మిర్రర్ బ్యూరో ):** భారత స్వాతంత్రోద్యమ విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో విద్యా, ఉద్యోగం, ఉపాధి హక్కుల సాధనకై యువత ఉద్యమించాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు. శనివారం నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం, మోటాపురం, అనాసాగరం గ్రామాలలో డివైఎఫ్ఐ మండల కమిటీ, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో బొడ్డు మధు మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన అజేయుడు చంద్రశేఖర్ ఆజాద్ అని కొనియాడారు. దోపిడీ పాలనను, అంతమొందించేందుకు, అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు, పేదోడి హక్కుల సాధన కోసం ఆయన సాగించిన ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన త్యాగమూర్తి అన్నారు. ఆయన ఆశయాలు కేవలం స్వాతంత్ర్య పోరాటానికే పరిమితం కాలేదని, సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం ఆయన అహర్నిశలు ఉద్యమించారన్నారు. నేటి ఆధునిక సమాజంలో పాలకులు అనుసరిస్తున్న అసమర్ధ విధానాల ఫలితంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువై వారి భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ప్రైవేటీకరణ, కార్మిక హక్కుల హరణ, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నానాటికి పెరుగుతున్న నిత్యవసరాల ధరల భారం రైతాంగ సమస్యలు కార్మికుల కష్టాలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో యువత చంద్రశేఖర్ ఆజాద్ చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువజన కార్మిక రైతాంగ ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించడమే చంద్రశేఖర్ ఆజాద్కు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రాసాల నవీన్, డీవైఎఫ్ఐ పాలేరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు భూక్య వనజ రాథోడ్, ఒక్కంతల ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు చీర్ల చక్రి, డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు ఎలమద్ది లెనిన్, డివిజన్ కమిటీ సభ్యులు నగేష్, సెల్వరాజ్, నాగార్జున్, రైతు సంఘం నాయకులు ఇంటూరి అశోక్, ముటాపురం సర్పంచ్ ఏలూరి రామారావు, అనాసాగరం గ్రామ సర్పంచ్ బొడ్డు రాంబాబు, మండల కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## చందన పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం

**చౌటుప్పల్,ఫిబ్రవరి 28, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చందన పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఈ గురువారావు పాల్గొని విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలను తిలకించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ...విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని తెలిపారు. సర్. సి.వి.రామన్ 1928 ఫిబ్రవరి 28న రోజున రామన్ ఎఫెక్ట్ కనుగొన్నారని ఆయన జ్ఞాపకార్థము ప్రతి సంవత్సరము ఈరోజు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటామని, రామన్ ఎఫెక్ట్ కాంతి పరిక్షేపనం గురించి వివరిస్తుందని, ఈ సిద్ధాంతశీ వల్ల వివిధ రంగాలలో ఎన్నో ప్రయోజనాలుఉన్నాయని,భారత ప్రభుత్వం నోబెల్ బహుమతి,భారతరత్న అవార్డు,లెనిన్ శాంతి బహుమతిని గెలుచుకున్న ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త అని, ప్రతి ఒక్కరూ సైన్స్ పట్ల ఆసక్తి కనపరిచి భవిష్యత్తులో భావిభారత శాస్త్రవేత్తలుగా రాణించాలని, విద్యార్థిని విద్యార్థులందరూ శాస్త్రీయ స్పృహని పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె స్వప్న, పద్మ,అర్చన, గీత, జి స్వప్న,జగదీశ్వరి,దీప,లావణ్య, సంధ్య,తేజ,ఉష తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలి

**ఆసక్తి చూపుతున్న రంగాలలో వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు**

**పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి**



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 28 (క్రైమ్ మిర్రర్) :** చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెలిగితే అద్భుతాలు సృష్టిస్తారని పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. పాపిరెడ్డి నగర్ లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రెయిన్బో హై స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రజ్ఞా హై స్కూల్ కరస్పాండెంట్ అశోక్ ప్రీతంల ఆహ్వానం మేరకు మెగా రోబోఫెస్ట్ అండ్ సైన్స్ మేళా కార్యక్రమానికి పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రోత్సహించడం వలన పిల్లలు ఎంతో చురుకుగా ఉండడమే కాకుండా భవిష్యత్తులో వారికంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల రామకృష్ణారెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, డాకురి అక్కిరెడ్డి, బివికె శ్రీకాంత్, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుంది

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 28 (క్రైమ్ మిర్రర్) :** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి కెపిహెచ్బి కాలనీ మూడో పేస్ లోని బతుకమ్మ కుంట ను పరిశీలించారు. ఇక్కడ వాకింగ్, స్కేటింగ్, ఓపెన్ జిమ్ కు వచ్చే వారి వాహనాల పార్కింగ్ విషయమై సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రమేష్ బతుకమ్మ కుంట ను సందర్శించారు. మరోవైపు ఎక్కడ టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో ఇక్కడికి వచ్చే వారికి, బయట రహదారులపై వాహనాలు పార్కింగ్ చేయడంతో స్థానికులకు ఇబ్బందికరంగా తయారయింది. ఈ మేరకు పార్కును సందర్శించిన రమేష్ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. వెంటనే వాహనాల పార్కింగ్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఫణీంద్ర, రంగమోహన్, పిడికిటి గోపాల్ చౌదరి, అరవింద్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఓ గొప్పవరం

**నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28 (క్రైమ్ మిర్రర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గిరి నగర్ డివిజన్ (283) బి .జె .ఆర్ నగర్ వాసులు ఎం.డి నూర్జహాన్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నది చికిత్సకి సరిపడ్డ డబ్బులు లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 1,75,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 1,75,000/- (ఒక లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు ) సీఎంఆర్ఎఫ్ - ఎల్ఓసి మంజూరి పత్రాలను ఎం.డి నూర్జహాన్ కు శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికే విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు

**ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి**



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 28 (క్రైమ్ మిర్రర్) :** చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి విద్య,వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి అన్నారు. శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి శుభోదయం కాలనీలోని ఎస్ ఆర్ డి జి స్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి మాట్లాడుతూ చిన్నారులు చిన్నతనం నుండి ఆసక్తి చూపుతున్న రంగాలలో వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ డి జి స్కూల్ ప్రిన్సిపల్ లావణ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటిని వృధా చేయరాదు

**మిషన్ భగీరథ బీపీటీల సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టిగళ్ల వెంకటయ్య**



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: మిషన్ భగీరథ సురక్షితమైన మంచి నీటిని ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం ప్రతి గ్రామానికి అందిస్తుందని ఆ నీటిని వృదా చేయకుండా విధిగా వాడుకోవాలని మిషన్ భగీరథ బిపిటిల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జెట్టిగళ్ళ వెంకటయ్య సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గత మూడు రోజుల కింద ఏర్పాటు చేసిన గ్రామ సంఘంలో వారు వివరించారు. గ్రామంలో ప్రతి ఇంటి దగ్గర మిషన్ భగీరథ నీటి నల్లాలకు ట్యాపులు బిగించుకోవాలని, వచ్చేది వేసవికాలం కాబట్టి నీటిని వృధా చేయరాదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్వాల అంజిలయ్య, ఉప సర్పంచ్ టీ.విజయకుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి భాస్కర్, వార్డు సభ్యులు చాకలి వెంకటేష్ కర్రె.వినోద్ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ విద్యాలయం పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**క్రైమ్ మిర్రర్,ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శనివారం రోజున మండల కేంద్రంలోని సరస్వతీ విద్యాలయం పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పరిశోధనలను ప్రదర్శించారు. ఈ పరిశోధనలను ప్రాథమిక పాఠశాల ఆత్మకూరు(ఎం)మరియు బ్రిలియంట్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తిలకించడం జరిగింది.ఈ ప్రదర్శనలను చూసి ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రముఖ పారిశ్రామిక వేత్త తొర్ర విష్ణు, ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తమకు ఉన్నటువంటి అనుమానాలను నివృత్తి చేసుకుంటూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తులో గొప్ప సైంటిస్టులు అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే. ఐలయ్య,పేరెంట్స్ కమిటీ ప్రెసిడెంట్ బూడిద శేఖర్, ఉపాధ్యాయులు విష్ణు,యాసిన్, సుధాకర్,లలిత,సంతోష,సంధ్య, మహేశ్వరి,మాధవి,ఉపేంద్ర,గంగ, కృష్ణవేణి,లక్ష్మి ,రేణుక ,లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## ప్రజల ఇబ్బందులు గమనించి పరిష్కరిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ బీజన బాలమణి భాస్కర్

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం)ఫిబ్రవరి 28 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని సిల్క్ నగర్ కాలనీలో కొన్ని ఏరియాలలో వీధిలైట్లు లేకపోవడం వలన చీకటిగా ఉండి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని స్థానిక కాలనీవాసులు మున్సిపాలిటీ చైర్పర్సన్ బీజన బాలమణి భాస్కర్ కి తెలియపరచగా,వెంటనే స్పందించిన చైర్పర్సన్ బీజన బాలమణి భాస్కర్ వీధిలైట్లు వేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు చింతకింది సిద్ధులు,చింతగింది రంగా,ఎస్.కె హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్ పోలీస్ సిబ్బందికి బీమా, పొదుపు మార్గాలపై అవగాహన

**విధి నిర్వహణలో ప్రమాదాలు చోటు చేసుకుంటే భీమ పాలసీలు కుటుంబానికి కొండంత అండగా ఉంటుంది.. బాలానగర్ సీఐ నర్సింహా రాజు**




**బాలానగర్, ఫిబ్రవరి 28 (క్రైమ్ మిర్రర్) :** నిరంతరం విధుల్లో ఉంటూ ప్రజల రక్షణ కోసం పాటుపడే పోలీసుల సామాజిక భద్రతే ధ్యేయంగా బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పోలీస్ సిబ్బందికి పర్సనల్ లైఫ్, యాక్సిడెంటల్, మెడికల్ ఇన్సూరెన్స్‌తో పాటు పొదుపు మార్గాలపై ఆర్థిక సలహాదారు రమేష్ బోయ్య సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రమేష్ బోయ్య, వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలో జీవిత బీమా పోషించే కీలక పాత్రను వివరించారు. కుటుంబ బాధ్యతలు, ఆదాయం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సరైన ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఎలా ఎంచుకోవాలో సిబ్బందికి వివరించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ లభించే టర్మ్ ప్లాన్ల గురించి, క్లెయిమ్ ప్రక్రియలు, పన్ను ప్రయోజనాల (టాక్స్ బెనిఫిట్స్) గురించి ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రమాదాలు లేదా అనారోగ్య సమస్యల సమయంలో బీమా పాలసీలు కుటుంబానికి కొండంత అండగా నిలుస్తాయని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్, ఏఎస్ఐ హనుమయ్య, కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ సందేహాలను నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు.




## జనగణన సర్వేలో పిఎస్ హెచ్ఎం,ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలను సూపర్వైజర్ గా నియమించాలి

**పిఎస్ హెచ్ఎంఏ సంఘం జిల్లా అధ్యక్షులు టి ఆనంద్ కుమార్, నరేష్ కుమార్**

**కుల్కచర్ల తాసిల్దార్ మనోహర చక్రవర్తికి వినతి పత్రం సమర్పించిన ఉపాధ్యాయులు**

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జన గణన జనాభా లెక్కలు మే10 నుంచి జూన్10 వరకు చేసే సర్వేలో పిఎస్ హెచ్ఎం లు అలాగే ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలను సూపర్వైజర్లుగా విధులు నిర్వహించుటకు నియమించాలని కుల్కచర్ల తాసిల్దార్ మనోహర్ చక్రవర్తికి పిఎస్ హెచ్ఎంఏ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు తుప్పలి ఆనంద్ కుమార్, రాష్ట్ర నాయకులు నరేష్ కుమార్ వినతి పత్రం సమర్పించారు. తాసిల్దార్ మనోహర్ చక్రవర్తి సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు తావుర్య నాయక్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుకు ప్రధాన మంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం



**క్రైమ్ మిర్రర్,ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శనివారం రోజున మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు(ఎం)మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుగాను భారత ప్రధాని నరేంద్ర మోడీకి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గజరాజు కాశీనాద్, ప్రధాన కార్యదర్శి నాతి బిక్షపతి గౌడ్,కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారు సత్యనారాయణ,ఆత్మకూరు గ్రామ ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్, బీజేవైఎం మండల ప్రెసిడెంట్ పైల ప్రశాంత్,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మేడి సాగర్, ఆత్మకూరు భూత్ అధ్యక్షులు లోడి వెంకన్నగౌడ్,పరకాల రాంబాబుగౌడ్,బబ్బురి వీరస్వామిగౌడ్,కోరే లక్ష్మణ్, బబ్బూరి శివలింగం గౌడ్,బోడ స్వామి,బండారు సాయి, ఎలిమినేటి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## పరిగి పట్టణంలో వైభవంగా సాగిన చండీ హోమం

**పాల్గొన్న ఎమ్మెల్యే రాంమ్మోహన్ రెడ్డి దంపతులు**

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న 39వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం శ్రీ చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ హోమంలో పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి వారి సతీమణి శ్రీమతి ఉమా రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన చండీ హోమం భక్తి పరవశంలో సాగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు పార్థసారథి పంతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ'(కరువు)'పని చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28: వికారాబాద్ లో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల సమావేశాలలో భాగంగా శనివారం ఉదయం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులలో యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఎనిమిదివ రోజుకు చేరుకున్న ఈ సమావేశల్లో పాల్గొని ఉపాధి హామీ పనులను సందర్శించారు. ఈ సందర్భనలో ఉపాధి హామీ కూలీలతో పని చేసి వారి సమస్యలను,స్థితిగతులను తెలుసుకున్నారు. ఉపాధి హామీ పని అంటేనే మహాత్మ గాంధీ గుర్తుకు వస్తారు. అలాంటి ఆ పథకానికి మహాత్మ గాంధీ పేరు తొలగించడం సరికాదని అక్కడి కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గత యూపీఏ ప్రభుత్వంలో ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్,యూపీఏ చైర్ పర్సన్ గా సోనియా గాంధీ ఏ గ్రామంలో కూడా కరువు ఉండవద్దని,వలసలు లేకుండా ఉండాలని ఈ మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి పథకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఉపాధి హామీ పథకంతో కరువు ప్రభావిత గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి గ్రామీణ ప్రజలకు తక్షణ ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. నీటి సంరక్షణ ,చెక్‌డ్యామ్‌లు,కాలువల పునరుద్ధరణ వంటి పనులు భవిష్యత్ కరువు నివారణ కు దోహదం చేస్తాయని అన్నారు. రైతులు,కూలీలకు ఉపాధి కల్పించడం మాత్రమే కాకుండా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి కూడా ఈ పథకం ద్వారా సాధ్యమవుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని వినియోగించుకోవాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ ఇలాంటి మంచి పథకంలో ఈ మోడీ ప్రభుత్వం మహాత్మ గాంధీ పేరు తొలగించాలని చూస్తున్నారని అన్నారు. ఈ పథకాన్ని ఇదే విధముగా కొనసాగించాలని లేదేంటే భారత దేశ ప్రజలు మీకు బుద్ధి చెబుతారని, ఈ పథకానికి మహాత్మ గాంధీ కొనసాగించాలని పేరు మారిస్తే మీరు గొప్ప వాళ్ళు ఏమి కారు అన్నారు. పేరు మారిస్తే ఎవరి బతుకులు మారవు అన్నారు. మార్చేది పేరు కాదు పేదవాడి బతుకులు మార్చలన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకొని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇలాగే కొనసాగించి పేద ప్రజలకు అండగా ఉంటామన్నారు.

## విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన రచయిత ప్రొఫెసర్ బైరెడ్డి కృష్ణారెడ్డి**






**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28:** విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ భువనగిరి చైర్మన్ , బీ స్మార్ట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పట్టణంలోని సోమ రాధ కృష్ణ,ఫంక్షన్ హాల్ లో ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రచయిత ప్రొఫెసర్ బైరెడ్డి కృష్ణారెడ్డి , రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ముద్దం బాల్ రెడ్డి హాజరై వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు రాయబోయే పరీక్షలకు ఇష్టంతో రాయాలని కష్టంతో కాదు అని అన్నారు . విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. అదేవిధంగా పరీక్షలు రాసేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధైర్యంగా రాయాలని మంచి ర్యాంకులు సాధించాలని విద్యార్థులను దీవించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాపించి నాటి నుండి నేటి వరకు 100శాతం కూడిన పదవ ఫలితాలు వస్తున్నాయని అదేవిధంగా గత సంవత్సరంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించామని,భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యకు కేరాఫ్ విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నిలుస్తుందని అన్నారు. మీరు జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్న ఉన్నత చదువులను చదవాలన్న పదవ తరగతే మీ పునాదికి నాందిఅన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పగిడాల పురేందర్ రెడ్డి , బాల్ రెడ్డి , పాఠశాల ప్రిన్సిపల్స్ అపర్ణ , స్వాతి , శ్రీ విద్య , ఉపాధ్యాయుల బృందం , తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.






## త్రిపుర గవర్నర్ ని కలిసిన బిజెపి నాయకులు

**క్రైమ్ మిర్రర్,ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదాద్రి శ్రీ లక్ష్మి నర్సింహా స్వామిని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి శనివారం రోజు దర్శించుకోవడానికి వచ్చిన సందర్భంగా వారిని మర్యాద పూర్వకంగా యాదగిరిగుట్టలోని రాష్ట్రపతి భవన్ లో కలవడం జరిగింది. వారి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య,జిల్లా ప్రధానకార్యదర్శి కాదురి అచ్చయ్య, ఆత్మకూరు(ఎం)ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్,బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి దయ్యాల కుమారస్వామి,దేవినేని వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ టైలర్స్ డే వేడుకలు



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ కేంద్రంలో అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు భోగ వెంకటాచలం మాట్లాడుతు సంఘం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యాకుబుస్వామి, ప్రధాన కారదర్శి అయిలి వెంకటేష్,సహాయ కార్యదర్శి కీర్తి సత్తయ్య,కాముని లావణ్య, కోశాధికారి ఎండీ ఖలీల్,సలహా దారులు వెంపటి రమేష్,కటకం బాలరాజు,బాల్నే దామోదర్, కర్ణాల నర్సింగ్ రావు,రాచర్ల నర్సింహులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

-తంగడపల్లి పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

మండల విద్యాధికారి ఈ. గురువారావు




**చౌటుప్పల్,ఫిబ్రవరి 28, క్రైమ్ మిర్రర్:** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని మండల విద్యాధికారి ఈ గురువారావు అన్నారు. శనివారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగేడి పల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరి పాలన దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి ఈ గురువారావు, కౌన్సిలర్ ఆలే చిరంజీవి పాల్గొని మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులచే ఉచిత విద్య లభిస్తుందని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వ అందించే ఉచిత వసతులను వినియోగించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని,సమాజానికి తమ వంతు సేవలందించాలని అన్నారు. జిల్లా కలెక్టరుగా డీ గౌరీ మనోహర్, అదనపు కలెక్టర్ గా కే. సాత్విక్, జిల్లా విద్యాధికారిగా కే నాని కృష్ణ, మండల విద్యాధికారిగా దీనికి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గా కే జస్వంత్, ప్రధానోపాధ్యాయులుగా జీ సహస్ర, పాఠశాల చైర్మన్గ లుగా ఆర్ అక్షిత వారి వారి పాత్రలను పోషించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కే శివకుమార్, ప్రధానోపాధ్యాయురాలు డి భార్గవి, నాయకులు ఆలే చిరంజీవి, ప్రధానోపాధ్యాయుడు పి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, మంజుల, రాధిక, శ్రీరాములు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కల్వకుర్తి పుర భివృద్ధికి సహకరించాలి

**మంత్రి, ఎంపీని కలిసిన స్థానిక నాయకులు**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని శనివారం స్థానిక మున్సిపల్ చైర్మన్ భర్త, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ తో పాటు పలువురు కౌన్సిలర్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు మల్లురవి ని కలిసి విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తి మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ.. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి కోసం ఆనంద్ కుమార్ ఇటీవలే కీలక నేతలను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని భూ సమస్యలు,పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధుల గురించి చర్చించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి దృష్టికి స్థానిక సమస్యలను తీసుకెళ్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా పట్టణానికి గరిష్ట ప్రయోజనం చేకూరేలా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ రామరాజు, మాజీ కౌన్సిలర్ లు గోరటి శ్రీనివాసులు, చిన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

**500 మందికి ఉచిత వైద్య సేవలు**

**ముఖ్య అతిథిగా సినీ హీరో తనీష్ అల్లాడి**



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** నేరేడుచర్ల మున్సిపాలిటీ 14వ వార్డులో శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ స్థానిక ప్రజల్లో విశేష స్పందనను రాబట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ హీరో తనీష్ అల్లాడి హాజరై క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమాన్ని 14వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు సమన్వయంతో నిర్వహించారు. అభివృద్ధిలో ఆదర్శంగా 14వ వార్డు క్యాంప్ అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తనీష్ మాట్లాడుతూ, నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డు అభివృద్ధి పరంగా ఇతర వార్డులకు ఆదర్శంగా నిలుస్తోందనీ,ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే విధానం ప్రశంస నీయమైనది అని అన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉన్నప్పటికీ, అభివృద్ధి కార్యక్రమాల్లో జనసేన వార్డు ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా కలిసిమెలిసి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా స్థానిక పాలనకు విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో సుమారు 500 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు కూడా నిర్వహించి, అవసరమైన వారికి వెంటనే కళ్లజోడులు అందజేశారు. అలాగే అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా పేద మరియు బడుగు వర్గాల ప్రజలకు గణనీయమైన ఉపశమనం కలిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని వైద్యులు పేర్కొన్నారు. వైద్యుల బృందం సేవలు క్యాంప్‌లో పలువురు నిపుణులైన వైద్యులు సేవలందించారు. డాక్టర్ మాధవ రెడ్డి కంటి వైద్య నిపుణులు డాక్టర్ మణికంఠ గౌడ్ ఫిజిషియన్, మక్తల్ డాక్టర్ కె. ప్రియాంక , స్త్రీ రోగ నిపుణులు డాక్టర్ శ్రీజ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ తిరుమల్ జనరల్ సర్జన్ పారామెడికల్ సిబ్బంది శాంతి, బాలరాజ్ రెడ్డి తదితరులు వైద్యుల సమన్వయంతో శిబిరం సజావుగా సాగింది జనసేన సేవా దృక్పథం ఈ సందర్భంగా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రజలకు అవసరమైన సహాయం ఎప్పుడైనా అందించేందుకు కట్టుబడి ఉన్నారని తనీష్ తెలిపారు. ప్రజల ఆరోగ్యం, విద్య, మౌలిక వసతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, హుజూర్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వరావు తదితర నాయకులు పాల్గొన్నారు. ప్రజల స్పందన రాజకీయాలకు మించిన సేవ స్థానికులు ఈ క్యాంప్‌ను స్వాగతిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజా సేవకు ప్రాధాన్యం ఇవ్వడం అభినంద నీయమని అభిప్రాయపడ్డారు. మొత్తానికి, నేరేడుచర్ల 14వ వార్డులో నిర్వహించిన ఈ మెగా హెల్త్ క్యాంప్ ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఒక సానుకూల అడుగుగా నిలిచింది. రాజకీయ పార్టీలు అభివృద్ధి, సేవల ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవచ్చునే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది.

# తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం సిల్వర్ జూబ్లీ సమావేశం విజయవంతం

**సంఘం జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు**






**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో ):** తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సమావేశం స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు కార్యదర్శి వి వీరాచారి సమక్షంలో జరిగింది ఈ సమావేశమునకు రాష్ట్ర అధ్యక్షులు వెంకన్న ప్రముఖ న్యాయవాది సుగుణ రావు గారు అరుణోదయ అధ్యక్షురాలు విమలక్క కొత్తగూడెం అధ్యక్ష కార్యదర్శి వెంకట్రావు నటరాజు మరియు సూర్యాపేట జిల్లా కార్యదర్శి రాజేందర్ రాజబాబు రెడ్డి హాజరైనారు ఈ సమావేశంలో గ్రామీణ వైద్యుల చట్టపరమైనగుర్తింపు కొరకు ప్రతి సభ్యుడు ఒక సైనికుడిలా పనిచేయాలని తెలియజేయడం జరిగింది మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన జీవో నెంబర్ 429&428 లను యధావిధిగా అమలుపరిచి అంతకుముందు 75 శాతం ట్రైనింగు పూర్తి చేయడం జరిగింది మిగిలిన 25% సభ్యులకు ట్రైమింగ్ ఇప్పించి చట్టపరమైన వైద్యం చేసుకొనుటకు ప్రభుత్వపరమైనటువంటి సర్టిఫికెట్ ఇప్పించాలని కోరడమైనది లేని పరిస్థితులలో మేము కూడాలి ఉద్యమాలు మరి పోరాటాలు చేయవలసిన అవసరం వస్తుంది ఎందుకు అనగా ఎన్నో కుటుంబాలు ఇదే వృత్తిమీద ఆధారపడి తమ జీవన ఉపాధి కొనసాగిస్తున్నారు అందువల్ల దయచేసి మా విన్నపాన్ని గుర్తించి తప్పక అమలుపరుస్తారని మనవి ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాసరావు ఉపాధ్యక్షులు వీటి దాసు గౌరవ సలహాదారులు ఎం రఘు టౌన్ అధ్యక్షుడు సోమశేఖర్ అర్బ మండల కార్యదర్శి అమృత రావు కోశాధికారి గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ జిల్లా లోని గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు



# మాదాపూర్ పోలీసులకు ఆరోగ్య పరీక్షా శిబిరం...

మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : మాదాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు. డా. నవీన్ రెడ్డి మరియు వారి వైద్య బృందం చేపట్టిన ఈ శిబిరంలో రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, షుగర్ పరీక్ష, రక్తపోటు పరీక్ష, క్రియాటిన్ పరీక్షలు నిర్వహించారు. అదనంగా ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి కిడ్నీ ఆరోగ్యానికి సంబంధించిన క్రియాటినిన్, సీరమ్ స్థాయిల ప్రాముఖ్యతను వివరించారు. సిబ్బంది తగినంత నీరు తరచుగా తాగాలని, ఉప్పు వినియోగాన్ని తగ్గించాలని, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవాలని సూచించారు. అలాగే నియమిత వ్యాయామం, సమతుల ఆహారం, సరైన ఆహార నియంత్రణ పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమి పూజ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలి

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని దుబ్బ కాలువ గ్రామానికి వెళ్లే రోడ్డులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమి పూజ కార్యక్రమానికి 01-03-2026 ఆది వారం ఉదయం 11 గంటలకు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఈ భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు... భూమి పూజ అనంతరం నియోజకవర్గ స్థాయిలో సమావేశం సమావేశం ఉంటుంది... ఈ కార్యక్రమానికి నాంపల్లి మండలం పరిధిలోని అన్ని గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ నాంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఆకాశానికి ఎగిసిన నారాయణ అకాడమిక్ ఫెయిర్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఆకాశానికి ఎగిసిన నారాయణ అకాడమిక్ ఫెయిర్ అద్భుతం అమోఘం అనితర సాధ్యం మా మార్గం అని మళ్ళీ నిరూపించారు మన నారాయణ విద్యార్థులు. సైన్స్ ప్రయోగాలతో సంచలనం సృష్టించారు ఇంటరాక్టివ్ ప్రదర్శనలు ప్రాజెక్టులద్వారా విద్యార్థుల సృజనాత్మకత, జ్ఞానం మరియు నైపుణ్యాలు ప్రదర్శించరూ అలాగే కళలతో కూడా కనువిందుచేశారు తల్లిదండ్రులు సందర్శించి ప్రశంసల వర్షం కురిపించారు ఇట్టి కార్యక్రమంలో జిఎం గోపాల్ రెడ్డి డీజీఎం వల్లి కుమార్ ఆర్ఎన్డిస్ అనిల్,స్వాతి , సంగీత కోఆర్డినేటర్స్ కనకరాజు, అనూష , ఆఫ్రిన్ ప్రధానోపాధ్యాయురాలు దివ్య డీన్స్ శ్రీకాంత్, కార్తీక్ ఉప ప్రధానోపాధ్యాయురాలు సనోవర్ , భాగ్యలక్ష్మి ఏవో రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు విద్యార్థులను ప్రశంసించారు వారిలో నూతన ఉత్తేజాన్ని నింపారు



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 ఆదివారం 1-3-2026

# ప్రతి ఫిర్యాదును ఆన్లైన్ లో నమోదు చేయండి

**ఫిర్యాదుకు భరోసా కల్పించండి.. ప్రతి కేసులో నాణ్యమైన ధర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసి, భాదితులకు అండగా నిలవండి**

**లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు, ఎబ్.బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్ ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలి**

**రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి**

**విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రివార్డ్ ల అందజేత**

**మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ లో అధికారులకు పలు సూచనలు చేసిన ఎస్పీ పరితోష్ పంకజ్**



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి 28: మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ పరితోష్ పంకజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్, ఎబ్.బి.డబ్ల్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్ లో వేగం పెంచాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించడం జరిగింది. లాంగ్ పెండింగ్ కేసుల చేధనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఇన్వెస్టిగేషన్లో సందేహాలు ఉంటే, ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి, వారిలో భరోసా కల్పించాలని, ప్రతి ఫిర్యాదును ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు. ఎస్.హెచ్.ఓ లు తమ ఏరియాలో గల ప్రతి గ్రామాన్ని సందర్శించి, ఆయా ప్రాంతాలలో గల సమస్యలను తెలుసుకోవాలని, విమెన్ సేఫ్టీ, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రజలను చైతన్య పరచాలన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ ల కదలికలపై నిఘా ఉంచి, తరుచూ చెక్ చేయాలని అన్నారు. బ్లూ కోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది "పాపిలోన్ డివైస్" లను వినియోగిస్తూ.. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ సేకరించాలన్నారు. నేరాల అదుపులో, జరిగిన నేరాలను ఛేదించడంలో సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ... వివిధ కుల మతాలకు చెందిన పవిత్ర స్థలాలలో, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ పంప్స్ తదితర ముఖ్యమైన ప్రాంతాలలో కమ్యూనిటీ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా, వివిధ సంఘాల పెద్దలకు అవగాహన కల్పించాలని యస్.హెచ్.ఓ లకు సూచనలు చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది. అదేవిధంగా తమ తమ పోలీసు స్టేషన్ సిబ్బంది చేసిన మంచిపణులను గుర్తిస్తూ ప్రశంసా పత్రాలకు సిఫారసు చేయాలని ఎస్.హెచ్.ఓ లకు సూచించడం జరిగింది. అనంతరం యస్.హెచ్.ఓ వాహనాలను తనిఖీ చేస్తూ... ప్రతి వాహనాన్ని రెగ్యులర్ సర్వీసింగ్ చేయిస్తూ, వాహనాలు పూర్తి కండిషన్ లో ఉండే విధంగా చూసుకోవాలని డ్రైవరులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ సిహెచ్. రఘునందన్ రావ్, డియస్పిలు సత్యయ్య గౌడ్, ప్రభాకర్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, సురేందర్ రెడ్డి, ఎఆర్. డిఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్స్ రమేష్, కిరణ్ కుమార్, నాగేశ్వర్ రావ్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావ్, జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్ఇన్స్పెక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించాలి**

**ప్రధానోపాధ్యాయులు బట్టు మధు**

**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల నేరేడుచర్ల నందు ఘనంగా నిర్వహించారు. తన ప్రయోగాల ద్వారా భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన శాస్త్రవేత్త భారతరత్న సర్ సివి రామన్ కు నోబెల్ బహుమతి సాధించి పెట్టిన ప్రయోగం రామన్ ఎఫెక్ట్ ను ప్రకటించిన రోజు జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవంగా జరుపుకుంటారని, విద్యార్థులు శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు,ఆవిష్కరణలు చదువుతూ స్ఫూర్తి పొంది చదువుల్లో,భవిష్యత్తులో శాస్త్ర,సాంకేతిక రంగాల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు అన్నారు .సైన్స్ ఉపాధ్యాయులు సైదులు, మాధవి , జానకి రాములు ,ఆర్ శౌరి విద్యార్థులకు క్విజ్,వ్యాసరచన ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు నరసింహారావు అన్నపూర్ణ, జానయ్య, బికోజి రామ్మూర్తి ,హాస్రున్ ,ఎన్వి నాగమణి ,యాదగిరి నగేష్, సరస్వతి ,వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి**



**చౌటుప్పల్,ఫిబ్రవరి 28, క్రైమ్ మిర్రర్:** మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని దుబ్బ కాలువ గ్రామానికి వెళ్లే రోడ్డులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమి పూజ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శ్రీకారం చుడుతున్నారని, నేడు ఆదివారం ఉదయం 11:00 గంటలకు జరిగే భూమి పూజ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు,తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,వార్డు అధ్యక్షులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి కోరారు.

## ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి: టి ఎస్ యూ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు కే. గోపాల్ నాయక్

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ )** మైలర్దేవ్పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు రోజా విరోనికా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు టిఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే. గోపాల్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ నమూనాలను అతిథులు ఆసక్తిగా తిలకించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.ముఖ్య అతిథి కే. గోపాల్ నాయక్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ఒక శాస్త్రవేత్త దాగి ఉంటారని, నిత్యం ప్రశ్నించే తత్వాన్ని అలవర్చు కోవడం ద్వారా కొత్త ఆవిష్కరణలు సాధ్య మవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉత్తమ నమూనాలను తయారు చేసిన విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల సృజనాత్మకతను ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై. శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, శ్రీధర్, సాధిత్ అలీ, ప్రకాష్ లింగం, షబ్బీర్, అహమద్, రాజు, గోపాల కృష్ణ, ఉమాదేవి, వంశీ, శ్రీధర్, రాములు, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ వ్యతిరేక సిఫార్సులను సహించబోం: టిఎస్ యూటి ఎఫ్





**విద్యా కమిషన్ నివేదికపై రాజేంద్రనగర్ మండల కమిటీ ఆగ్రహం**

**కాంట్రాక్ట్ నియామకాలు, వేతనాల తగ్గింపు ప్రతిపాదనలపై మండిపాటు**

**గండిపేట్ :( క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన తెలంగాణ నూతన విద్యా కమిషన్ సమర్పించిన నివేదిక ఉపాధ్యాయ లోకంలో పెను దుమారం రేపుతోంది. కమిషన్ పొందుపరిచిన పలు అంశాలు ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాజేంద్రనగర్ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షులు బి. యాదగిరి, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ మాట్లాడుతూ, కమిషన్ నివేదికలోని అంశాలు ఉపాధ్యాయుల అస్తిత్వాన్ని ప్రశ్నించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఉపాధ్యాయుల నియామకాన్ని శాశ్వత ప్రాతిపదికన కాకుండా, కాంట్రాక్ట్ పద్ధతిన చేపట్టాలని సూచించడం ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని వారు విమర్శించారు. తెలంగాణలో ఉపాధ్యాయుల వేతనాలు అధికంగా ఉన్నాయని, వాటిని సమీక్షించి తగ్గించాలని (దేశంలో 11వ స్థానంలో ఉన్నామని సాకు చూపుతూ) సిఫార్సు చేయడం కమిషన్ అనాలోచిత వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పనితీరు అంచనా పేరుతో ఉపాధ్యాయులను సర్వీసు నుండి తొలగించే అధికారం కోరడం నిరంకుశత్వమేనని వారు పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కనీస అర్హత అయిన (డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్). కోర్సును రద్దు చేయాలనే ప్రతిపాదనను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే, సుదీర్ఘకాలం పదోన్నతులు పొందని ఉపాధ్యాయులకు లభించే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్లను (6, 12, 18, 24 ఏళ్ల ఇంక్రిమెంట్లు) రద్దు చేయాలని చూడటం ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలపై దెబ్బ కొట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, మెరుగైన పి ఆర్ సి ని అందించాల్సిన సమయంలో.. విద్యా కమిషన్ తన పరిధిని దాటి ఇలాంటి వివాదాస్పద సిఫార్సులు చేయడం సమంజసం కాదు" అని నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ అభ్యంతరకర అంశాలను నివేదిక నుండి తొలగించాలని, లేనిపక్షంలో టిఎస్ యూటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.




## రంజాన్ మాసంలో సేవా స్ఫూర్తి చాటిన డా. ముస్తాక్ అహ్మద్

**పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ**

**డాక్టర్ సేవలు అద్వితీయమని హమీద్ షేక్ ప్రశంసలు**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఫిబ్రవరి 28: పవిత్ర రంజాన్ మాసంలో మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని నల్లగొండ జిల్లా ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ పేర్కొన్నారు.మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రఖ్యాత చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ ముస్తాక్ అహ్మద్ సేవలు అద్వితీయమని ఆయన కొనియాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పలు ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేయడానికి డాక్టర్ ముస్తాక్ అహ్మద్ ముందుకు రావడం అభినందనీయమన్నారు.శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో హమీద్ షేక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రంజాన్ మాసం ఆత్మపరిశీలన, ఉపవాస దీక్షలు, దానధర్మాల కాలమని తెలిపారు. ఉపవాస దీక్షలను ముస్లిం సోదరసోదరీమణులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరిపై అల్లా అనుగ్రహం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మసూద్, ముజీబ్ రెహ్మాన్, నజీర్, బాబా, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.